

డిస్కవరీ ఆఫ్ కొలంబస్

కనుక్కొని, వెతుక్కొని పేపరాఫీసు కెళ్ళాడు రాజు.

నలుగురైదుగురు కూర్చుని కులాసాగా కబుర్లు చెప్పుకుంటున్నారు.

తనని నిన్న ఆదరించి నాయనెవరో గుర్తుతెలీక తట పటాయిస్తూ ఆ గదిగుమ్మంలో నిలబడిపోయాడు రాజు.

"నా కివాళా రేపుకూడా షూటింగులేదు. 'సుబ్బరంగా రెస్టు తీసుకో అమ్మా' అన్నాడు ప్రొడ్యూసరు" అంటున్నాడొకాయన కాళ్ళు ముడుచుకు కూర్చుంటూ.

రాజు తుళ్ళిపడి అటుచూశాడు. అమ్మా అన్నాడంటాడేమిటి, అమ్మా బొమ్మాను అనుకుని. చూస్తే ఆయన మొగాడే, మరి ఆ

ప్రొడ్యూసరెవడో వీణ్ణి రెష్టు తీసుకో అమ్మా అని ఎందుకన్నాడు? చూస్తే పచ్చి మొగాడుగదా. బుగ్గమీసాలు గేరాజుట్టూ వాడూను. అయితే ఒకవేళ బాలనటుడేమోలే అని సర్ది చెప్పుకున్నాడు.

'నాగ్గూడా లేదుగా షూటింగు — ఎల్లుండే నా డాన్సుంది. లైటింగూ అదీ అయేసరికి అవతలెల్లుండవుతుంది. దానికే భవుళా వెళ్ళను. స్పెషల్‌గా సిలుకు లంగా కుట్టించమంటే కుదర్దు పొమ్మన్నాడు డాన్సు డైరెక్టరు. నేనెందు కెళ్ళాలేం?' అన్నాడు ఇంకో ఆయన. ఆ శాస్త్రీకీ బుగ్గమీసాలున్నాయి జహంగీరులా.

రాజుకి గుండె గుభేలుమంది. ఏమిటీ మిష్టరీ? ఆడాళ్ళంతా మొగవేషాల్లో ఉన్నారా? ఇక్కడ షూటింగవు తోందా?....

"నన్నడిగితే మానెయ్యమంటాను. పట్టుపడితే వదల కూడదు. నేను మానెయ్యలే? .... కిందట్నెల పిక్చరు మొదలెట్టినపుడు, సెకండు హీరోయనిమ్మని అడిగాను. లేకపోతే, ఒక డాన్సు వుండే రోలన్నా కావాలన్నాను .... అది కుదరదూ, కోయవాడి రెండో కూతురే వెయ్యమన్నాడు నన్ను .... అక్కర్లేదు పొమ్మన్నాను" అన్నాడు తృతీయుడు.

"ఓ యబ్బో నీ కబుర్లకేం లేవోయ్. అది కుదరదన్నవాడివి మొన్న .... లో చిన్నత్తవేషం కావాలని అడగలేదు? నాకు పోటీగా" అన్నది నాలుగోశాస్త్రి.

రాజు బుర్ర పనిచెయ్యడం మానేసింది. ఉన్నా ఊడినా ఒకటేనన్న భావంతో గుడ్లు ఊడి పడబోయాయి.

సన్నగా సలాకలా వున్న ఇంకో ఆయన హాండిల్ బార్ మీసం సర్దుకుని, 'మేష్టార్లూ మీసంగతికేం గాని మొన్న సుబ్బన్న గారూ నేనూ ఓ అమ్మణ్ణి ఆశీర్వదించాం....నా రంగా ఏమిపిల్ల అనుకున్నారు. మన

డిష్కవరీలెండి. మనకి తెలిసిన పత్రికల్లో ఒకటి రెండు వారాల్లో బొమ్మ అదీ వేయిస్తున్నాం .... అబ్బ రెండుకళ్లూ చాలవనుకోండి. అందుకే ఆశీర్వచనం రేటులో ఫిఫ్టీ పెర్సంటు డిస్కౌంటు" అన్నాడు తన్మయానందంతో.

'ఎవరదీ' అన్నాడు సెకండు హీరోయిను వేషంకోసం ముచ్చట పడ్డాయన.

'కళ్ళు కలువల్లు. ముక్కు నువ్వుపువ్వు. నుదురు 'రిఫ్లెక్టరే' ఆ మెరుపూ ఆ తళుకూ నే చెప్పలేను.'

'ఒద్దులెండి. అయినా ఆ శ్లోకులు మేకపులలో వచ్చేస్తాయి. ఒడ్డు పొడుగు ఉండాలి ఏపుగా ఉండాలి.' అన్నాడు పట్టు పరికిణీ కుట్టించమని డైరెక్టరుతో పోట్లాడినాయన.

'వేరే చెప్పాలా మేష్టారూ .... అచ్చు ప్రబంధనాయికే.' అన్నాడు ఆమెను డిస్కవర్ చేసిన కొలంబస్ మధురస్మృతిపథంలో షికారు బయల్దేరుతూ. అందరూ ఒక్కనిముషం మౌనం పాటించారు; తాప సూచకంగా, కొందరు సంతాప సూచకంగా.

'అయితే ఒక్క విషయం' అన్నాడు కొలంబస్ కొంటెగా చూస్తూ.

ఏమిటది అన్నాయి ఎనిమిది కళ్ళు; ఒక్కలోపం ఉన్నా చాలునన్న ఆశతో.

'ఆ పిల్లకి నడుం లేదు' అన్నాడు కొలంబస్.

'లేదు?' అన్నాయి ఎనిమిది గొంతుకలు.

'లేదు'

'అస్సలు?'

'జోర్తిగా'

'నిజం?'

'నిజం.'

'ఓరి బాబోయ్!' అన్నాయి గొంతుకలు.

'ఆ .... మరేవిటనుకున్నారు. నడుం లేదు. అస్సలు లేదంటే నమ్మండి మేస్టార్లూ' అన్నాడు కొలంబస్.

'అంటే రెండు సెపరేట్ ఒళ్ళులు అన్నమాట' అంది ఒక గొంతుక అపనమ్మకం ధ్వనిస్తూనే.

'ఒళ్ళులు అన్న శబ్దంలేదు. అలాటి బహువచనం ఎక్కడా కనబడదు మీకు' అన్నాడు కొలంబస్.

'మీ గ్రామరు తగలేసిరి, ఛస్తుంటే సంధి మంత్రంలా. అడిగిందానికి జవాబు చెప్పవయ్యా' అన్నాడు తర్డ్ హీరోయిన్.

కొలంబస్ నిస్సహాయుడై పోయినట్లు చూచి, ఒక్కసారి విరగబడి నవ్వేసి 'హారి మీ యిళ్ళులు బంగారంగానూ!....లేదంటే లేదనా అర్థం.... పిచ్చివారా .... పుతినే చమత్కారానికన్నాను .... లేదంటే, ఉందా లేదా అనిపించేటంత సన్నగా ఉందన్న మాట. మిగతా బాడీ మీద కంపేర్ అండ్ కాంట్రాస్ట్‌గా' అని మళ్ళా పగలబడి నవ్వేశాడు ఆయన.

సభికులకు ఆటే నచ్చలేదు ఈ వివరణ. అనుమానంగా కోపంగా చూశారు.

"ఏవయ్యోయ్? నాటకాలాడబోక మాకాడ. కిందటెన్నెల నన్ను 'దీవించి' బొమ్మేయించడానికి తాంబూలం పుచ్చుకున్నపుడు ఏం చెప్పావు. ఆర్నెల్లదాకా ఇంకెవళ్ళీ దీవించి కాంపిటీసను రానివ్వను అని ఒట్టెయ్యలే? ఇపుడు మళ్ళీ ఇదేంకథ?"—

అని ఒకాయన అనబోయాడు.

అలాంటిదేదో జరుగుతుందని కొలంబస్‌కు తెలుసు. తక్షణమే రాజు అతని కంటికి కనబడ్డాడు. కనపడగానే జ్ఞాపకం వచ్చాడుకూడా.

"హల్లో బ్రదర్, ఎప్పుడొచ్చావ్? రా. కూర్చో అలా నిలబడి పోయావేం? .... ఖమాన్ .... " అన్నాడు రాజుతో అర్జెంటు రాచకార్యాలున్నట్టు.

రాజు తుళ్ళిపడి, మేలుకుని, ఈ హఠాత్సన్మానానికి ఆశ్చర్యపడి లేచి, 'యస్సార్ అయామె స్టుడియో సార్....యువారె బాక్స్ యండు మైబాగ్ సార్....యస్టర్డే అయామే మీటింగ్...." అంటూ సాధ్యమైనంత తేట తెల్లంగా సుళువైన పెలిగ్రామ్యభాషలో తన భావాలను బట్వాడా చేయడానికి ఉపక్రమించాడు.

"షష్ కం అండ్ చెయిర్ డౌన్ ఇన్ ది సిట్" అన్నాడు కొలంబస్ నవ్వుతూ.

తక్షణం సభికులు లేచి, నిరసనగా ముక్కుపుటా లెగరేసి, వెళ్ళి పోయారు.

రాజొక కుర్చీలో కూలబడి తన కథ చెప్పాడు తెలుగులో.

రాజు ఆత్మకథ మొదలు పెట్టబోయేవరకు కొలంబస్ తుళ్ళిపడి హోల్డాన్ అన్నాడు. "బాబ్బాబు నీ పుణ్యం ఉంటుంది. నీ కథతో నన్ను తోమి తోమి వదిలి పెట్టకు. కన్నీళ్ళస్టాకు లేదు. ఈ సారికి నన్నొది లేయ్" అన్నాడు.

"వాట్‌సార్ నిన్న నాకు కాఫీకూడా ఇచ్చి అంత ఆదరించి మాట్లాడారే—అయ్యో అని విచారించారే—ఫరవాలేదని ధైర్యం చెప్పారే —పెట్టే, సంచి ఇక్కడ పెట్టుకోవచ్చునన్నారే—ఇవాళ ఇంతకోపం

ఎందుకు నామీద ఎడిటరు గారూ? బైది బై డైలాగెలా వుంది?" అన్నాడు రాజు బాధగా.

"హారినీ యిల్లు బంగారంగానూ. ఇందాకట్నించీ నా మాటలు విని నేనే ఎడిటర్నను కున్నావా? ఛంపేశావు. వారు వేరు. ఇప్పుడే వస్తారు. నేను/ఉత్త ఫ్రెండుని. ఊరికినే వచ్చానన్నమాట. ఇంకానయం ముందరే చెప్పావు. నేను ఒక ప్రొడ్యూసరు బ్రదరిల్లాని. ఇంకో ఎగ్జిబిటర్ మేనల్లుడిని.... వెరీ పవర్ ఫుల్ మాన్ ని. ఏమనుకున్నావో — పోతే డైలాగు బ్రిలియంట్ గా లేదు" అన్నాడు కొలంబస్.

"అయ్యో బాబోయ్! నిజంగానే? అయామె యంగ్ మెన్ సార్. అయి వాంటు జాయింటు ఫిలిం ఫీల్డు .... అయామె హీరో ఫర్ సిక్స్ డ్రామాస్ .... "

"తెలుగులో కంటిన్యూ చెయ్యి. అదరవైస్ సమ్ రీడర్సు విల్ నాట్ అండర్ స్టాండ్యూ" అన్నాడు కొలంబస్.

"రైటో సార్. నేను చలనచిత్రములలో చేర నభిలషించుచున్న ఆంధ్ర యువకుడిని. ప్రతిభావంతుడిని. బోల్డు ఉత్సాహం ఉంది.".

"వెరీగుడ్. ఉత్సాహంకాక ఇంకేమిటి ఉన్నాయి?"

"ఆశయాలూ ఆదర్శాలూ, ఓ రేకుపెట్టి, ఎం. శ్రీరాములు అండ్ బ్రదర్ వారి సంచీ, (మావద్ద యక్సర్ సైజు బుక్కులు: ఎక్కములు బుక్కులు, పెన్సిళ్లు, రబ్బర్లు, సకలాంధ్ర వాచక పుస్తకములు మేలైన డిటెక్టివ్ నవలలు మొదలగునవి సరసమైన ధరలకు దొరకబడును. ఇట్లు-) ఉన్నాయండి. సంచీలో ఓ చొక్కాలాగు, కొంచెం లిట్రేచరు ఉందండి."

"వెర్రీగుడ్. పెట్టిలో ఏముంది."

"పెట్టెలోనాండి .... పెట్టెలో నవల్సులూ, స్క్రీను ప్లేలూ,

సినిమా సాంగ్సులూ అవీ ఉన్నాయండి" అన్నాడు రాజు బోల్డు సిగ్గుపడుతూ.

"ఎన్ని వీశెలు?" అన్నాడు కొలంబస్ సిగరెట్ ముట్టిస్తూ నిర్లక్ష్యంగా.

రాజుకు కోపం వచ్చింది. 'కళని వీసెల్లో తూచే నిష్కళంకు లనుకోలేదు: మీరు' అన్నాడు గంభీరంగా ఇంటి పైకప్పు వంక చూస్తూ.

"బాగుంది బ్రదర్. ఒక్క పెట్టే అన్నావు కాబట్టి వీశె అన్నాను. నా సొమ్మేం పోయె. మణుగులనమంటే అలాగే అంటాను. పుట్లు అనమన్నా నాకు అభ్యంతరంలేదు. అవేవో పందుములు, గరిసెలు, ఇంకా తులాలూ, ఫలాలూ, ఏబులాలూ, పేలాలూ, అమృతలాలూ ఇలా ఏలెక్కన తూయించడానికీ కూడా నేను పేచీ పెట్టను" అన్నాడు.

'అసలు కళని ఎవరేనా తూస్తారేవిటండీ'

'లేకపోతే డబ్బులెలా గిడతాయి. అమ్ముకోవూ?'

'బాగుంది సార్. అలా అమ్ముకునేటట్లయితే అంత కష్టపడి రాయటం ఎందుకు?'

"ఎందుకేవిటి? తెల్లకాయితాలు అమ్మాలంటే కష్టంగదా? గవర్నమెంటు వాళ్లు ముందర లైసెన్సు అదీ పుచ్చుకోమంటారు. వాటిమీద ఏదో ఓటి రాసి పడేస్తే ఆ బెడదలుండవు. అదృష్టం వుంటే ఏ వహీదా రెహమానో చదువుతుంది. ఆనక నీమీద 'ప్యాసా' తియ్యొచ్చు".

రాజుకి బోధపడలేదు. అందుకని తనకు తెలిసిన పద్ధతిలోనే చెప్ప దలచినది చెప్పడానికి ఉపక్రమించాడు. ఇప్పుడవన్నీ చెప్పకపోతే, ఆనక "చేయిజారినపిట్ట చిక్కిపోయెనే" అని డైలాగు అనుకుంటూ క్లోజప్‌లో విచారపడాల్సొస్తుందని అతనికి తెలుసు.

అందుకని పుంజుకుని, "నావద్ద సినిమాకి మొత్తం నాలుగొందల యాభై సబ్జెక్టులు రెడీగా ఉన్నాయిసార్. చూడరాదా?" అన్నాడు ఆశగా, సూటిగా.

"అయ్యబాబోయ్. అయితే నువ్వోరైటు. పీసెల్లో తూచలేం; అడుగుల్లో కొలవలేం. ఉజ్జాయింపుని పీసెడు కథ మూడుమైళ్ళ పొడు గుంటుంది గద. ఆ లెక్కన నీదగ్గిర ఓ పదిపుట్ల కథలుంటే ఎన్నిమైళ్లు? చెప్పు. ఖమాన్. పీశకి మూడుమైళ్లు. పుట్టికెన్ని? .... ముందర పుట్టి కెన్నిపీశలో చెప్పు .... ఊఁ చెప్పవేం? పుట్టి కెన్నిమైళ్లు మైలు కెన్ని పీశలు, పీశ కెన్ని గంటలు? ఇవికూడా తెలీపోతే యువారన్‌ఫిట్ .... " అన్నాడు కొలంబస్.

'సారీ సార్. తెలీదండి'

'హూఁ .... ఇలాంటి వాళ్ళంతా రైటర్లవుతున్నారు .... బ్రదర్. ఓపే కొండగుర్తు. ఈ ప్రపంచంలో నీకు తెలీందేదీ లేదు. నీకు తెలీం దేమైనా ఉందేమో ఒకవేళ ఆ సంగతి నీకు తెలీదేమో అని ఎవరైనా అంటే. అదీ తెలుసని వాదించు. ఝూమ్మని దబాయించు' అన్నాడు కొలంబస్.

'సబ్జెట్లు చూస్తారండి? ....' అన్నాడు రాజు ఆయన ఉపన్యాసం కానిచ్చి.

'ఏమి సబ్జెట్లోయ్! సబ్జెట్లూ పెసరట్లూను. పుట్లకొద్దీ ఉంటే నేనెక్కడ చూదను. టైము లేదు .... నో టైము.'

"ఇందాకళనే చెబుతూ ఉంటే, మీరు అంతా వినలేదండి. ఆ నాలుగొందల యాభై నేనింకా రాయ లేనివండి. రాయాలి. ఊరికినే హెడ్డింగులు రాశానన్నమాట. వింటారా?" అంటూనే, గబగబ పక్క గదిలోకెళ్ళి ఓ మూల ఉన్న తన పెట్టతీసి, 'అయ్యో బాబోయ్!' అని పరుగెత్తు కొచ్చాడు రాజు.

"పెద్ద టోకరాండి. నా పెట్టె ఎవడో కొట్టేసి వాడిది నాకు తోసేసాడండి రైల్లో. మర్చిపోయాను ఇప్పుడెలాగ? నా లిబ్రేచరు...."

"నీ లిబ్రేచరు పోతే మరేం ఫరవాలేదులే. ఆ కొత్త పెట్టిలో ఏముందో చూడు. అందులోనైనా కాస్త పనికొచ్చే కాయితం ముక్క లుండచ్చు....నోట్లు లాటివి."

"ఏం లేవండి. సుమారు రెండు వీశల న్యూసుపేపర్లు, రెండు ఖాళీసీసాలు ఉన్నాయండి. బెంగుళూరు, బొంబాయి, కలకత్తా, ఢిల్లీలలో పాతపేపర్లు వీసె ఎలాకొనేదీ రాసిన అట్ట ఓటి ఉందండి .... అయితేనేం ఫరవాలేదు. నా లిబ్రేచరు నాకు కంఠతావే. చెప్పనాండి?"

"ఊఁ కానీ, ఏంచేస్తాం నీదయ." అన్నాడు కొలంబస్.

"శుక్లాంబరధరం విష్ణుం" చదువుకుని పుంజుకున్నాడు రాజు రాబోయే చిత్రాల జాబితా. "అతుకుల బ్రతుకులు, బతుకుల అతుకులు, బతుకులలో గతుకులు, శిథిలగృహం, శ్మశానవాటిక, సుందరి ఎ. మ్మె. బన్‌రొట్టి, నాన్‌రొట్టి, (ఈ రెండూ క్యామిడీల్లెండి) బావా మరదళ్లు, వాన వడగళ్లు, జోడెడ్లబళ్లు, ఆశ, (మూడక్షరాలవి, లక్కీ పేర్లు చెప్పనాండి?) నిరాశ, దురాశ, పేరాశ, కులాసా, దిలాసా, (ఈ రెండూ హ్యూమరికల్) పలాసా, మసాలా (ఇవి పైటికల్‌వి) లలాలా (మ్యూజికల్) సీత, లీల, బాల, గోల, రాధ, బాధ, బరి, శబరి, కబరి, అంబారి, లంబాడి, (ఇక్కణ్ణించి నాలుగు వండీ) మా మావయ్య, మీ అత్తయ్య, శేషశాయి, హాయి హాయి, ఇరుగిల్లు, పొరుగిల్లు, గల్లుగల్లు, దుర్యోధనుడు, దుర్మార్గుడు, సన్మార్గుడు, ధర్మరాజు, బెజవాడ, మెడ్రాస్, గుడివాడ జంక్షన్, (ఇది డిటెక్టివ పిక్చర్లోకి హెడ్డింగులనుకోండి .... మీదయ అన్నాడు కొలంబస్) తరువాత కాంచనమాల, యాటంబాంబ్, శిలీముఖం, సగం సగం, నువ్వా నేనా...."

“అట్టె అట్టె హోల్డాన్....శిలీముఖం అంటే ఏమిటి బ్రదర్” అని అడ్డు తగిలాడు కొలంబస్.

రాజు అరక్షణం ఆగాడు. ‘తెలీదండి ఏదో ఓటి. మనకెందుకు పోనిస్తురూ, ఏం .... సోషల్స్....సుధా, మధూ, నిర్మలా మోహన్ —

“ఆగవయ్యాంటే....శిలీముఖం సంగతి చెప్పవేం? అర్థం చెప్పూ”

‘హెడ్డింగులికి అర్థం ఏమిటి సార్ నాబొంద .... కథకి కాళ్ళు చేతులా అన్నట్టు దీనికి అర్థమా పర్థమా ....క్యాచీగా ఉండాలి అంతే’

‘మీబొంద....వెతికితే అర్థం పర్థం అన్నీ ఉంటాయి. శిలీమొహం అంటే .... శిలి అనే వాడి ముహం అన్నమాట. బాగా దానాలూ అవీ చేశారు, వీడూ దధీచీ అనే ఇంకోడూ. అసలు వారిద్దరీ జాయింటు స్టోరీ. నువ్వు విడదియ్యడం బాగానే ఉందనుకో. రెండు పిక్చర్లకి పనికొస్తుంది. ఏం? ఆ శిలి అనేవాడి ముహంతో ఓ స్టాట్యూటు కట్టారు. దాని కథ అన్న మాట తెలిసిందా?”

“తెలిసింది కానండి తప్పేమోనండి. మీరు చెప్పిన వాడి పేరు శిబి అనుకుంటా!”

‘లాభంలేదు. మోస్ట్ అన్ ఫిట్. అర్ధజాకి చెల్లవు. ఎప్పుడూ అలా నీ కంటే పెద్దవాళ్ళ మాట రైటు కాదేమో అనకు. రైతో అనడమే. పెద్దవాళ్ళు సిలి అంటే సిలే. శిబి అంటే శిబే. అయినా శిబేమిటి నా బొందలా ఉంది. సిలే అయుంటుంది వాడిపేరు’

“నీ హెడ్డింగులు వింటే ఓటి జ్ఞాపకం వస్తుంది అబ్బాయ్. ఓ కథ చెబుతా విను” అన్నాడు కొలంబస్.

*   *   *   *

నువ్వింకా ఉత్త హెడ్డింగులే రాశావు. మా ఫ్రెండు శేషగిరి కట్టలికట్టలు కథలు రాశాడు సినిమాలకని....ముఖ్యంగా పౌరాణికాలమీద స్పెషలిస్టు అన్నమాట. సీతారాముల దగ్గిర్నించి సాయిబాబా దాకా ఎంత మంది దేవతలూ రాక్షసులూ ఆడా మగా ఉన్నారో అందరి కథలూ విడి విడిగా జమిలిగా సమిష్టిగా తయారుచేసి వాటికి ట్రీటుమెంటు రాసి అట్టే పెట్టుంచాడు. ఎవరన్నా ప్రొడ్యూసరు అర్ధరాత్రప్పుడు ఓ సబ్జెటు కావాలంటే రెడీ అనేవాడు గిరి. అయితేనేం ఎవడూ వీడికి కానీయిచ్చిన పాపాన పోలేదు. కథ వీడిదగ్గిర పుచ్చుకోడం చూస్తాననడం చూసి, దాన్ని ఇంకో పేద్ద రైటరెవడికో యిచ్చి రాయించుకోడం ...గిరి గాడు బోరెత్తి నెత్తి మొత్తుకోడం .... నాన్సెన్స్. శూర్పణక ఖథ వాడిబాబు ముల్లా అని వాళ్ళు తిట్టడం .... ఇదీ వరస ....

ఒకసారి గిరిగాడు జటాయువు కథ సినిమాకి బెస్టుగా ఉంటుందను కున్నాడు. అనుకోడమేమిటి ఇద్దరు ముగ్గురు బ్రోకరు ఫ్రెండ్లకి మెల్లిగా ఈ సంగతి చెప్పి, రాత్రి తెల్లవార్లూ కూచుని తను కథ రాసి పారేశాడు. జటాయువు కథ తెలుసుగా. వాడి అన్న సంపాతి అని ఓడున్నాడు. ఇద్దరూ ఒకర్తినే ప్రేమించారన్నమాట. వాళ్ళ నాన్న బీదపక్షి. అంటే ముసలాడు. బలం లేదన్న మాట. మరి దేగలకి బలమేగదా ఆస్తి. సరే ఆ ముసలాడు ఓ చెట్టు కొమ్మమీద కంబళి కప్పుకుని దగ్గుతూ కూర్చుండగా బిగినవుతుందన్న మాట.,

"దేగలు కంబళీ కప్పుకుంటాయాండి?" అన్నాడు రాజు జంకుతూనే.

"ఎందుక్కప్పుకోవు. అయితే, చేనేత కంబళ్ళు కప్పుకుంటాయి అలాని డిస్ట్రిబ్యూటరుకూడా చెప్పాడు. ఆనక రైటర్ని అడిగితే, ఆయన రైట్ అని చెప్పాడు. ఒరిజినల్ రామాయణంలో ఓ శ్లోకంలో బిట్వీన్ ది లైన్సు—అంటే రెండు లైన్ల మధ్యన ఉందిట".

"ఏదీ? చేనేత కంబళీయాండి? అంత పల్చగా నేసేవారా?" అన్నాడు రాజు ఉత్సాహంతో, ఆశ్చర్యంతో.

"నీ బొంద. జటాయువులు కంబళ్లు కప్పుకుంటాయీ అన్న సంగతి ఉంది. సరే కథ విను. ఆ జటాయు తండ్రి అలా ఇంట్రవెల్ దాకా దగ్గుతూ బతికుంటాడు. ఈ లోగా జటాయూ, సంపాతీ ఆ పిల్లదేగ కోసం పవర్ ఫుల్ డైలాగుల్లో ఛెడామడా తిట్టుకుంటాయనుకో, అపుడే ఆకాశంలోకి ఎగిరి ఇద్దరూ రెక్కల్తో యుద్ధం చేస్తాయి. రెక్కల యుద్ధం ....కనీవిని ఎరుగని రెండు గండభేరుండాలు నోటిలో కాగడాలు పట్టుకుని రెక్కలతో కొట్టుకున్న అద్భుత భయానక రౌద్రదృశ్యాలను చూడుడు — అలాని రాసుకోవచ్చు పోష్టర్లమీద—ఏం. వాళ్లు కొట్టుకున్నాక సంపాతికి రెక్కలు తెగిపోతాయి. అక్కడ శాడ్ సాంగు .... ఇదిచూసి ఆపిల్ల మనసు విరిగిపోతుంది.

'హ్వాట్ లైఫ్। నాముూలన బ్రదర్స్ ఫైట్ చేశారు. వన్ ఫెలోకి రెక్కలు తెగిపోయాయి. పూర్ బర్డ్' అనుకుని ఓ పాటబాడి, బాగా పైకెగిరి రెక్కలు ఆడించడం మానేసి, కిందపడడం మొదలెట్టింది.

ఆ గండభేరుండం కింద పడిందా? (ఇక్కడకూడా చేనేత ప్రాప గాండా పెడితే జనాభాని బాగా ఆకర్షించొచ్చు) జటాయువేనా ఆమెని పెళ్ళాడాడా? వాడిరెక్కలు ఏమయ్యాయి? జటాయు సీతని రక్షిస్తాడా? సీతకి రాముడు కనబడతాడా? వెండితెరమీద చూడుడు.

"తరవాతి కథ చెప్పడానికి వీల్లేదనుకో. అక్కడే కీలకం అంతా ఉంటుంది. అది కాస్తా చెప్పేస్తే, ఆ కథని ఎవడేనా కొట్టెయ్యొచ్చు. అందుకని బేరం ఖరారని నమ్మకం కుదిరితేగాని ఎవరూ వివరంగా కథ చెప్పరు" అన్నాడు కొలంబస్.

"మరి నాకు మతిపోతోంది. ఎలాగా" అన్నాడు రాజు.

"పోతేపోనీ మరేం ఫర్వాలేదు. మిగతా కథ విను. అంటే జటాయు కథ కాదు. అది రాసిన గిరిగాడి కథ. వాడు జాగ్రత్తగానే ఉంచుకున్నాడు. వాడి బ్రోకరు ఫ్రెండు, పెద్ద పెద్ద స్టార్ల దగ్గిరా,

ప్రొడ్యూసర్లదగ్గిరా చూచాయగా ఆ కథ చెప్పి, దీన్ని ఫలానావాడు రాస్తున్నట్టు, అద్భుతమైన బాక్సాఫీసు ట్రీటుమెంటు చేస్తున్నట్టూ, ఆమాట అతిరహస్యమైనట్టూ, తనకే ఎలాగో తెలిసినట్టూ, నట్టుతూ మెల్లి మెల్లిగా ప్రూకా ఇస్తూ వచ్చేవాడు. ఒకానొక పెద్దస్టారు అదివిని బాగుందనడం జరిగింది. తక్షణం ఆ బ్రోకరుడు ఓ ప్రొడ్యూసరు దగ్గిర కెళ్ళాడు.

"ఫలానా బాక్సాఫీస్ స్టార్‌కి ఫలానా కథమీద దారుణమైన మోజు ఉంది. ఈ సంగతి యింకా ఎవరికీ తెలీదు. మీరు కనక ఆకథ విని కొనుక్కుంటే, ఆ స్టారుని సులభంగా బుక్ చేసుకోవచ్చు." అని చెవిలో చెప్పాడు.

ఆ ప్రొడ్యూసరు ఎంత లావువాడైనా యథాశక్తి ఎగిరి, చిన్న గంతువెయ్యడం సహజంకదా. సిఫార్సు తెచ్చుకోకుండా, పెళ్ళాం బిడ్డల్ని వెంటబెట్టుకువెళ్ళి ఆ స్టార్‌ను తన చిత్రంలో వేషం వెయ్యమని బ్రతిమాల నవసరం లేకుండా, కేవలం ఒక్క కథ కొనడంవల్ల చులాగ్గా బుక్ చేయడానికి వీలవుతోంది గదామరి.

సరే, అబ్బీ ఆ కథ ఎవరిదోయ్? అన్నాడు. ఫలానా శేషగిరిరావు రాస్తున్నారు అని చెప్పాడు బ్రోకరు. రైతో అని ప్రొడ్యూసరు బయల్దేరి వెళ్ళాడు. గిరిని అడిగాడు. గిరి ఎంతో సంతోషించాడు. డబ్బు అదీ మాట్లాడుకున్నారు.

అంతలోకే చిన్న చిక్కొచ్చి పడింది. సదరు ఏర్పాట్లు చేసిపెట్టిన బ్రోకరు సగానికి సగం వాటా యివ్వమన్నాడు, గిరిని. నేనింతగా కాన్వాసు చెయ్యకపోతే నీకు దిక్కేమిటి అని పోట్లాడాడు.

"అరే, నాకు ఆ ప్రొడ్యూసరు ఇచ్చిన డబ్బు చాలా కొంచెం కదా. దాన్ని రెండెట్టి భాగించడానికి వీల్లేదే. ఎలా?" అన్నాడు గిరి.

"ఎందుకు వీలుండదు? నా ప్రోపగాండా అప్పనంగా వస్తుందను కున్నావేం పాపం" అని దబాయించాడు బ్రోకరు.

"అయ్యో. నీ కివ్వడానికి నాకేం అభ్యంతరం లేదు. కాని ఆయన నాకిప్పుడిచ్చినది ఛాలా కొంచెం కదా. దాన్ని సగం సగం వాటా వెయ్యడానికి అస్సలు వీల్లేదు. 'ఇప్పుడిది లాంఛనంగా తీసుకోండి' పిక్చరు రిలీజయ్యాక మిగతాది మీకిస్తానూ అలాని చెప్పాడు ప్రొడ్యూసరు గారు. వృద్ధిలోకి రాదలచుకుంటే ఈ ఛాన్సు వదులుకోవద్దని బెదిరించాడు. అందుకని ఒప్పుకున్నాను" అని మొత్తుకున్నాడు గిరి.

"అదంతా నా కనవసరం. రిలీజయ్యాక వాడేమిస్తాడు. నువ్వేం పుచ్చుకుంటావు. ఇస్తే గిస్తే అదంతా నువ్వే ఉంచుకో. ఇప్పుడిచ్చింది మటుకు చెరిసగం వాటా వెయ్యాల్సిందే. వీల్లేదండానికి వీల్లేదు. ఎంతిచ్చాడో తియ్యి ఇవతలకి" అన్నాడు బ్రోకరు. అప్పుడు నేను అక్కడే ఉన్నానులే. అప్పటిదాకా గిరిని తిడుతున్నాను. ఇప్పుడు వీడి పోట్లాట చూస్తే నవ్వాగటం లేదు. ఆఖరికి ఆ గిరికికూడా నవ్వొచ్చేసింది అంత దుఃఖంలోను.

"ఇంద తీసుకో. ఇదే నా తొలి సినిమా ఆర్జన. బావుంటే, చాతనైతే దీన్ని భాగించు రెండు తోట" అంటూ, గూట్లో పెట్టిన తాంబూలంలోని 'అడ్వాన్సు' తీసి గదిమధ్య పడేశాడు.

'అయ్య బాబోయ్' అన్నాడు బ్రోకరు కొయ్యబారిపోయి. ఎందు చేతనో తెలుసా?

"భవుశా చెక్కు రాసిచ్చుంటాడు ప్రొడ్యూసరు" అన్నాడు రాజు దగ్గిరున్న తెలివితేటలన్నీ వాడేసి.

"సీబొంద. అయామ్ సారీ .... మీ బొందలు. ఆ ప్రొడ్యూసరు గారు తాంబూలంలో పెట్టి ఇచ్చింది కాష్. హార్డ్ కాష్. 1902వ సంవత్సరపు గుండు గల రాజుగారి రాగికానీ" అన్నాడు కొలంబస్.

రాజుకి అర్థంకాలేదు. ఆనక, 'వెళ్ళొస్తా బ్రదర్' అంది అతని మతి.

'1902 వ సంవత్సరపు గుండు ఏమిటండీ? పేటెంటు చేసిన ఫాషనా?" అన్నాడు ఇంకేం తోచక.

"ఆ కాలమానం గుండుకు విశేషణం కాదు. కాణీకి. గుండు, కాణీమీద రాజుగారి బొమ్మకి సంబంధించినది. సదరు గుండుగల రాజుగారి బొమ్మగల కాణీ అన్నమాట. కత్తీలేని కాణీ. దాన్ని రెండు వాటాలు వెయ్యడం ఎలా?'

'మరేంటి, మూడు వెయ్యొచ్చేమో'.

"దమ్మిడీలు దొరకట్లేదుగా. దొరికితే, ఓ దమ్మిడీ కమీషను ఇచ్చి, రెండు తీసుకుని చెరోటి పంచుకోవచ్చు. సర్లే అదెందుకు. వీళ్లైతే మాత్రం ఏం చేసుకుంటారు గనక".

ఆ బ్రోకరు నాలుగు తిట్టి, నీపని చెప్తానుండు అని బెదిరించి వెళ్ళిపోయాడు. నమ్మ నమ్మకపో బ్రదర్. మూడో నాటికల్లా "జటాయువు పెళ్ళి" అనే పిక్చరు తీస్తున్నట్లు ఇంకో ప్రొడ్యూసరు ప్రకటించాడు.

వీడికెల్లా తట్టిందిరా ఈ అయిడియా అని నేను వాకబు చేద్దును గదా. జరిగిందేమిటో తెలుసా? మా గిరిదగ్గర కథ తీసుకున్న ప్రొడ్యూసరు దాన్ని ఇంకో రైటరుకి చూపించి, డైలాగులూ గట్రా రాయమని బేరమాడి పుష్కలంగా డబ్బిచ్చాట్ట. తీరామోసి ఆ రైటరు తన ఆప్త మిత్రుడైన ఇంకో ప్రొడ్యూసరుకి దాన్ని అమ్మేశాట్ట. 'అదేంపనయా' అంటే 'జటాయువు నీసొంతం ఖదా? దాన్ని నా యిష్టం వచ్చినవాడికి అమ్ముకుంటాను. ఆపటా' అన్నాట్ట ఆ పెద్దరైటరు. ఇటు గిరిగాడి గోలకి అంతులేదు. వీడూ, వీడితోపాటు మొదట వాణ్ణి మోసంచేసిన ప్రొడ్యూసరూ కలిసి జాయింటయిపోయి డ్యూయట్ ఆరంభించారు. ఆ రెండోపార్టీ వాళ్లు అట్నించి గోలపెడ్తున్నారు. ఇంతట్లోకీ చల్లగా ఓరోజున "జటాయువుపెళ్ళి" అనేది ఎక్స్‌ఫిలింసువారి నెక్స్టుపిక్చరు అంటూ ప్రకటన వచ్చేసింది. ఆ పనిచేసిన ప్రొడ్యూసరు అమాయకుడే.

కానీ ఈ మా గిరీవాళ్లు చేసిన గోల తాలూకు పుకారు షికారెళ్ళి అతనికి సోకింది. అతను తక్షణం ఇంకో రైటర్ని కుదుర్చుకుని తను విన్న కథ యావత్తు చెప్పి, ఓ పెద్ద హోటల్లో ఉంచి తాళంపెట్టి, రెండుగంటల సేపులో ఆ కథకి టెంపరరీ ట్రీటుమెంటు రాయించేశాడు. దాన్ని పట్టుకుని, మొట్టమొదట — ఆ ఖదమీద మోజుపడ్డ స్టార్ తెలుసుగా — అక్కడి కెళ్ళి చూపించాడు. ఆ స్టార్‌కి ఈ భాగోతం ఏం తెలుసు? కథ బాగుందని, డబ్బు బాగా వస్తుందని కాంట్రాక్టుమీద సంతకం పెట్టెయ్యడం జరిగింది. వెంటనే ఆ ప్రొడ్యూసరు ఆ కథని ఆ సబ్జెక్టుని రిజిష్టరు చేయించేసుకుని ప్రకటన వేసేశాడు. ఇంకేముంది గో హో వింద"

"పిట్ట తగవు పిట్ట తగవు పిల్లితీర్చెను. విన్నావా. ఆ కథ ఎక్కడ పుట్టింది? ఏ కంపెనీ మెట్టింది? చిత్రంగాలేదు? నువ్వేమిటో సవాలక్ష హెడ్డింగులు వర్ణించావు ఇపుడు. ఇవన్నీ నీవేనని గేరంటీ ఏమిటి? ఇవి దక్కించుకు గట్టెక్కే ప్రజ్ఞ ఉందా?" అన్నాడు కొలంబస్ కథ ముగిస్తూ.

"జాగ్రత్తగా ఉంటానండి. అసలిలాటి పరిస్థితి రానియ్య నండి" అన్నాడు రాజు ధైర్యంగా.

"అయితే ఇది చెప్పు. నువ్వు గిరిగాడి పరిస్థితిలో ఉంటే ఏం చేస్తావు? ఆ సబ్జెక్టుని ఎలా రక్షించుకుంటావు?" అన్నాడు కొలంబస్.

"దాని విషయంలో చేసేదేముంది? నీళ్ళొదులు కోడమేనండి .... సుబ్బరంగా ఓ సోషలు కథ రాసుకుంటా"

"యూజ్‌లెస్. పనికిరావు. సోషల్ స్టోరీ ఎవడిక్కావాలి? క్యాస్టూమ్ పిక్చరు గురించి మాట్లాడుతూ ఉంటే? .... సరేవిను, గిరి ఏంచేశాడో తెలుసా? ఈ గోల మూలానా వాడిపేరు నలుగురికీ తెలిసిందిగా మరి. అందుకని జటాయుసినిమా తీస్తానన్న వాడంటే బాగా కోపం ఉన్న ఇంకోడి దగ్గిరకెళ్ళి సంగతంతా వివరంగా చెప్పి, వాళ్ళు తనదగ్గిర చెక్కేసింది అసలు కథ కాదనీ, అది వేరనీ తన కథలో హీరో సంపాతేగాని జటాయువు కాదనీ చెప్పాడు. అసలు వాల్మీకి అయిడియా కూడా అదేనుట.

అయ్యా వాల్మీకి గారూ మీ జటాయు స్టోరీ పిక్చరు తీస్తాం గాని హీరో ఎవర్ని వెయ్యమంటారూ అని గనక అడిగితే, పిచ్చివాళ్ళలారా సంపాతినే హీరోగా పెట్టుకోండీ, పిక్చరు హిట్టవుతుంది అని చెప్పేవాడే వాల్మీకి అని చెప్పాడు గిరి. అందుకని సంపాతి హీరోగా ట్రీటుమెంటు ఉందనీ అది మొదలెడితే బెష్టనీ నచ్చచెప్పాడు. అదృష్టం కూడా కలిసొచ్చిన మూలాన ఆ ప్రొడ్యూసరు రైతో అనేశాడు; అంతే ఈసారి గుట్టు చప్పుడు లేకుండా, 'జటాయు' పిక్చర్లో హీరోనే వీళ్ళ 'సంపాతి' పిక్చరుకికూడా ఎక్కువ డబ్బుమీద బుక్ చేసి, వరసగా 20 కాల్‌షీట్‌లు కుదిర్చేసుకుని 20 రోజుల్లోనూ సగం పిక్చరులాగి అవతల పారేశారు. ఇంక అవతలి వాళ్ళకి అపుడు తెలిసింది సంగతి. వాళ్ళింకా షూటింగే మొదలెట్టలేదు. అపుడు పోటీగా తీసినా లాభంలేదని మానుకున్నారు. తక్షణం వీళ్ళ 'సంపాతి' పేరు మార్చి మళ్ళీ 'జటాయువ' నే పెట్టుకున్నారన్నమాట. ఆ వేషం వేసిన పక్షి జర్మనీలో ట్రైనింగ్ ఐ వచ్చిందిలే, భలే చురుగ్గా యాక్టుచేసి పారేసింది. దాని పోర్షను మిగతా దెప్పుడు పూర్తిచేస్తారో నాకు తెలీదు. అదీ కథ. రాజా నీకిలాంటి చురుకుతనం, నేర్పు ఉన్నాయా?" అన్నాడు కొలంబస్.

'లేవండి' అన్నాడు వరహాలరాజు నీరసంగా.

"అయితే లాభం లేదు. నువ్వు సినిమాలో చేరడానికి పనికిరావు" అన్నాడు కొలంబస్.

రాజు దిగాలు పడిపోయాడు. కొలంబస్ జాలిపడిపోయాడు. కాస్సేపటికి తను లేచి, మెల్లిగా రాజునికూడా లేవదీసి, "ఏంచేస్తాం, అయామ్ సారీ" అన్నాడు.

"మరేండి. నేనుకూడా సారీయే....ఏం చేస్తాం. డబ్బేనా లేదు. నేనే ఓ ఫిలిం తీసి నాకు వేషం ఇచ్చుకుందును" అన్నాడు రాజు చాలా సేపు ఆలోచించి.

"లాభంలేదు. ఇప్పుడలా అనుకుంటావుగాని, అప్పుడు మన నొప్పదు. పిక్చరు దెబ్బ తింటుందని భయపడతావు. ఒకటే గుర్తుంచుకో అబ్బాయి. రికమెండు చేసినపుడు ఎవడినైనా సరే ఆఖరికి మనని మనం రికమెండు చేసుకున్నా సరే, సొంత పిక్చరు విషయంలో మటుకు వాటికి రొంత కూడా లొంగకూడదు. రిస్కు. పెద్దప్రమాదం. అంచేత ఇంకోడి సినిమాలో ఇలాటి సిఫార్సులు ఇవ్వడం, పట్టికెళ్ళడం మంచిది. ఫరవా లేదు" అన్నాడు కొలంబస్.

"అదీ రైటేనండి."

"రైటుకాక?....సర్లే. స్టుడియోకి పోదాం వస్తావా?" అన్నాడు కొలంబస్ తామిద్దరికీ అక్కడ అర్జెంటు పనున్నట్టు.

"తీసికెళ్తారా?" అన్నాడు రాజు ఉత్సాహంగా.

"స్టుడియో నాదికాదుగా....అంచేత ఫరవాలేదు. రా...." అంటూ కొంటెగా నవ్వాడు కొలంబస్.

ఇద్దరూ బయల్దేరారు.

''అన్నట్టు మీపేరేమిటి సార్?'' అన్నాడు రాజు హఠాత్తుగా.

''ఏదైతేనేంలే ఈ కథ రాస్తున్నవాడు కొలంబస్ అంటున్నాడుగా. వాడి మాటే కానీ''

''సరేండి కొలంబస్సుగారూ—''

''ఇదుగో. నువ్వు మళ్ళీ చిలవలూ పలవలూ పెడతావెందుకు — బస్సూ కారూ అంటూను. కొలంబస్ అను.''

"సరే సార్. నాపేరూ అలాగే చేశాడండి. వరహాల రాజు.

యమ్మెస్ యస్ వరహాల రాజు గదా. ఇంటిపేరూ అవన్నీ తీసేసి ఉత్తి రాజు అని రాస్తున్నాడు. పొగరు."

''నాకన్న నయమేకదోయ్. నీది చక్కహో తెలుగునేము. రేపొద్దున బుక్కయాకా—''

''రేపొద్దున్న బుక్కవుతానాండి? ఎందులో....హీరోయినెవరు? డబుల్ వర్షణలో కూడా మేకుద్దరమేనా? ముందర మూజిక్కెవరో చెప్పండి. నాకు యం. సత్యం శాంగు బ్యాగ్రౌండ్ పెడితే బాగుంటుంది. మరేమో—''

"గురో! హోల్డాన్....నా డైలాగు పూర్తి కానియ్యి. రేపొద్దున్న నువ్వు బుక్కు అయితే గియితే, ఆ పిక్చరు వస్తే గిస్తే అప్పటి సంగతి. అప్పుడు పబ్లిసిటీకి నీ పేరు బాగుంటుందీ అని నా అయిడియా. డాష్ పిక్చర్సు వారి ఎక్స్ చిత్రంలో ఫలానాదేవి, ఉత్తిరాజూ నాయికా నాయకులుగా నటిస్తున్నారు' అలాని రాసుకోవచ్చు—''

''సార్ వన్ మినిట్ నేను చెప్పింది 'ఉత్తరాజు' కాదండి. రాస్తున్నవాడు నా పేరుని కత్తిరించేసి, ఉత్తినే 'రాజు' అని మాత్రం అని రాస్తున్నాడు అని చెప్పానండి. ఉత్తిరాజు అయితే నాలుగక్షరాలు గదండీ. ఇంకో రెండు కలిపితే వరహాల రాజు అనే రాయొచ్చుగా. అంచేత—''

''పోనీ రాజే అనుకో. అది మటుకు బాగులేదూ? చక్కగా రెండక్షరాలు....రాజు. రాజు....ఆ మాటకొస్తే రాజ్. బాగాలేదా?"

''మరేండి లక్కీనేమ్ కూడా...." అన్నాడు రాజు మనసులో తన హృదయాధినేతను తలచుకొని.

* * * *

స్టుడియో లోపల ప్రవేశించడానికి, క్రితంరోజున రాజు చాలా అవస్థ పడ్డాడు. ఇపుడు కొలంబస్‌తో కలిసి సునాయాసంగా వెళ్ళిపోతున్నందుకు

పరమానంద భరితుడై పోయి, ఆశ్చర్యపడి లేచి నానా హడావుడీ చేయవలసింది. కాని, 'రాజ్' నామస్మరణలోపడి, ఆ మైకంలో ఉన్న మూలాన, అతనికి ఆ సంగతి తెలియనేలేదు. స్టుడియోలో అతని వెనుక నాలుగైదు చోట్లకి గిరగిర తిరిగాడు. ఎందులోకీ వెళ్ళలేదు. ఒక్కచోట ఇద్దరూ ఆగారు. కొలంబస్ ఎవరితోనో ఏదో మాట్లాడాడు. అంతలో రాజుకి ఒక అద్భుతం కనబడింది. కొలంబస్ తనవైపు తిరగ్గానే "సార్" అన్నాడు.

కొలంబస్ నవ్వాడు ప్రేమతో. "వత్సా నీకుతోచిన సందేహం నాకు తెలుసుకాని ఒక కథ జ్ఞాపకాని కొచ్చింది చెబుతాను. ముందర అది విను" అన్నాడు.

* * * *

కొంతకాలం పూర్వం అచ్చు నీలాంటివాణ్ణే బొంబాయిలో ఓ స్టుడియోకి తీసుకెళ్ళాను.

అవీయివీ చూశాక, అన్నీ అడిగి తెలుసుకున్నాక, ఇలాగే ఓచోట ఆగాం. హఠాత్తుగా అతనికి చిత్రమైన ఊహ పోయింది. "సార్-ఇది సవరాలకొట్టా ఇక్కడ విగ్గులుంటాయా అన్నాడు. (అయామ్సారీ ఇది భవుశా గ్రీనురూము కాబోసు) అన్నాడు రావు. —వాడిపేరు రావులే — అంచేత అన్నాడు రావు.

గ్రీను రూమేమిటి మేకప్‌రూము అనాలి అనిచెప్పాను నేను. మీకు తెలీదు సార్ గ్రీను రూమనే అంతా అంటారు. నేను బోల్డు నాటకాలు వేశాను అన్నాడు. నేను బోల్డు సినిమాలు తీశాను. దీన్ని మేకప్‌రూమే అంటారు అన్నాను నేను. వాడు ఓడిపోయి, సర్లెండి, మొత్తానికిది గ్రీను రూమన్న మాట అని తేల్చేశాడు.

"నీ దుంపతెగా ఇంతాచేసి అదానువ్వనేది. అయితే శుద్ధ తప్పు. ఇది గ్రీనురూమూ కాదు. ఏంకాదు" అంటూ ఆశ్చర్యపోయి, వచ్చాక,

"ఇది రికార్డింగు రూము" అని చెప్పాను. "ఇక్కడ సవరాలూ ఉండవు, విగ్గులూ ఉండవు, ఇక్కడ శాంగులు రికార్డుచేస్తారు. కావలి స్తైవిను" అన్నాను. అప్పుడే లీలగా వినబడ్డాయనుకో పాటలు.

వాడికోక్కపం వచ్చింది. 'వాట్ సార్. మరీ అంత పల్లెటూరి బైతుకింద జమరాసేస్తున్నారు నన్ను. ఇది మేకప్‌రూము కాకపోతే, ఇక్కడ శఃపీచు అంతా ఏమిటండీ? ఏవిటదంతా' అన్నాడు కోపంగా.

"ఏమిటిదంతా అంటే ఏమిటి? ఏముందిక్కడ నాకేం కనబడదేం?" అన్నాను.

"ఎందుక్కనబడదు? నాకళ్ళు పెట్టుకు చూడండి" అన్నాడు.

సరేనని వాడికళ్ళతో చూసాను.

అంతే చట్టవిరిగేలా ఆశ్చర్యపడ్డానన్నమాట. అక్కడంతా బోలెడంత జుట్టు. పెద్ద పెద్ద గేరాలూ, క్రాపింగులు, కొప్పులూ, అవన్నీని. కొంత నల్లటిజుట్టు, సవరాలకి సరిపోతుంది. కొంత పండినజుట్టు, కారెక్టరు యాక్టర్ల గడ్డాలకీ, విగ్గులకీ బాగుంటుంది. ఏమిటా ఇది అని దివ్యదృష్టితో చూచాను.

('వాడికళ్ళతో అన్నారుగా' అన్నాడు రాజు)

ఏడిశాడు వాడి కళ్ళేం పనికొస్తాయి బోడికళ్ళు. (బైదిబైదై లాగెలా వుంది?)....ఇది మూలకారణం తెలుసకోడాని క్కావలసిన దృష్టి అన్నమాట. సరే దాంతో చూస్తే ఏం కనబళ్ళేదు. వాట్ అనుకుని తెలివితేటలు తీసి ఉపయోగించాను.

(ఉన్నాయాండి! అన్నాడు రాజు వినయంగా)

కొంచెం సేపట్లోనే మిష్టరీ విడిపోయింది. తక్షణం వాడికా సంగతి చెప్పి అక్కణ్ణించి తగిలేశాను.

ఇంతకీ ఆ పరమసత్యం ఏమిటనుకున్నావు. అది నిజంగా రికార్డింగు రూమే! అక్కడ నిజంగా వంద విగ్గులకు సరిపడే జుట్టూ ఉంది. ఈ రెండూ ఎలాచేరాయి?

అని ప్రాసిక్యూషన్ లాయరులా అడిగి, ఆగి తాపీగా సిగరెట్టు ముట్టించాడు కొలంబస్.

చెబుతాడేమోనని ఓపిగ్గా చూశాడు రాజు. కానీ, కొలంబస్ ఆ నటన బావుందని దురభిప్రాయంలో స్వామి వివేకానంద స్వామికి మల్లే చేతులు గట్టుకొని, ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిస్తున్నాడు.

"చెప్పండి మరీ" అన్నాడు రాజు. కొలంబస్ చెప్పలేదు. అందు కని రాజు ఆలోచించాడు, ఆ పని అలవాటు లేకపోయినా.

"భవుశా, ఈ రికార్డింగు రూము పెట్టడానికి ముందు, గ్రీను రూము కట్టివుంటారు ముందస్తుగా' అన్నాడు.

"నీ తలకాయ. తప్పు. ఆ మధ్య భూమి చల్లారి, దానిమీద జీవకోటి పుట్టినప్పట్నించీ ఇక్కడ రికార్డింగు రూమే ఉంది తప్ప మేకప్పురూము లేదు. ఉన్నప్పటికిన్నీ ఇలా ఎవడూ విగ్గు జుట్టుని జల్లడు. ఇదేం మాటలా, బోల్డు ఖరీదు. పిక్చరు తియ్యడానికే బోల్డు అవుతూంటే, విగ్గులు తెచ్చి చింపేసి, ఆ జుట్టు వెదచల్లడానికి కూడా ఎవడు ఖర్చు పెడతాడు. హాబీ మంచిదేనేమోకాని, నాకు తెలిసినంత వరకూ—నాకు చాలా తెలుసు, ఈ ఫీల్డులో అలాంటి హాబీలు ఎవరికీ లేవు." అని గంభీరంగా ఆగిపోయాడు కొలంబస్.

"పోన్లే. సంగతేమిటో చెప్పవయ్యా నా ప్రాణం తీస్తున్నావు. నీ పోజూ నువ్వూను" అన్నాడు రాజు.

"సంగతీ, చాలా విషాదకరమైనది. పెద్ద ట్రాజడీథీము. దీనికి

తర్టీసిక్స్ వయోలిన్స్‌తో నాద నామక్రియలో ప్యూర్ కర్ణాటిక్ మ్యూజిక్ బాక్‌గ్రౌండు కావాలి"

"మేష్టారూ మీరు తొరగా తెమల్చకపోతే లాభంలేదు. ఇక్కడ చోటు అయిపోతోంది. నలిగి పోతున్నాను నేను" అన్నాడు రాజు విసుగ్గా.

"చోటైపోతే పక్క పేజీలో కథ రాసిన మేష్టార్ని కాస్త అడుగుదాం. సంగతేమిటంటే ఇది పెద్ద ట్రాజడీ ఈ జుట్టంతా సంగీత కళారాధకులది."

"నిజంగా? ఎవరన్నా దెక్కేశారా, లేపోతే, మొక్కుబడుందా" అన్నాడు రాజు.

'ఆ రెండూ కాదు. వాళ్ళ జుట్టు వాళ్ళే పీక్కున్నారు.'

"ఏం ఏంచేత?....ఇంకోటి మేష్టారూ మీ బుద్ధి పోనిచ్చుకున్నారు కాదు. మీరు ఇలా ముక్కలు ముక్కలుగా చెప్పి, ముక్కముక్కకీ పోజు పెట్టి, తెలుగు సినిమాలా సాగిపోవడం బాగులేదు. మీగ్గాదూ చెప్పేది?"

"సర్లే విను — ఇక్కడ కోట్ల కొద్దీ పాటలు రికార్డు అయ్యాయి గదా. బాక్సాఫీసు సూత్రాలు అని ఉంటాయి చూడు. అవి బిగించేవారు జనానికి. 'వాటికోసం అని' వాటి మూలంగా, ఇంగ్లీషు, శ్పానిష్, ఇటాలియన్, ఇండియన్, ఇంకా ఏవేవో బోల్డు దేశాలున్నాయి. ఆ రకరకాల సంగీతాన్ని తెచ్చి మనదాంతో కలిపి కాచి గిరగిరతిప్పి సాగదీసేవాళ్ళు ఇలా చేస్తేనే పాటలు హిట్‌లు అవుతాయి గదా మరి. అయినా కొందరు సంగీతం వచ్చినవాళ్లు ముందర ఒద్దు మొర్రో అని తేలిగ్గా మొత్తుకున్నారు. అనక, భరించలేక జుట్టు పీక్కుని కుప్పలు పోశారు. ఆ పాటలు కట్టిన వాళ్లుకూడా అంతే అనుకో. ఇష్టంలేక పోయినా, ఆ పనిచేసి, అనక, జుట్టు పీక్కొని కుప్పలు పోసి పోయేవాళ్లు. కొందరు సంకర సంగీతానికి అంకిత మిచ్చారు. కొందరు అపశ్రుతులికి అంకితం ఇచ్చారు. తరువాత మానేశారనుకో, అలవాటైపోయి. ఇదే అది. —దీనిలో కొంత ప్రేక్షకుల విరాళం .... బంగీలో పంపిస్తారు. తెలిసినవాళ్ళు తెచ్చి పడేశారు" అన్నాడు కొలంబస్.

'తెలిసిందండి' అన్నాడు రాజు.

"ఔనుగాని బ్రదరూ ఒక్క సందేహం. ఇందాక నువ్వేదో అడగబోయావు. నీకీ కథ చెప్పాను. ఏమిటదీ. నీకూ ఈ సందేహమే వచ్చిందా. నీకూ ఈ విగ్గులు కనబడ్డాయా?" అన్నాడు కొలంబస్.

"ఔనండి" .... అన్నాడు రాజు సిగ్గుపడుతూ.

"యూజ్-లెస్ — అయితే నువ్వు పనికిరావు. ఇలాటివి నీకు కనబడకూడదు, కనబడితే నువ్వు బాక్సాఫీస్‌కి ఆమడ దూరాన ఉన్నావన్న మాట. ఇందులో చేరలేవు. చేరినా బాక్సాఫీస్పాంగు బతికిననన్నాళ్ళు కూడా నిలబడలేవు" అన్నాడు కొలంబస్.

రాజూ, కొలంబస్ అలా కొంచె దూరం నడిచేసరికి సన్నగా, పొడుగ్గా, వయోలిన్‌లా సొగసుగా ఉన్న చిన్నవాడొకడు ఎదురై 'హలో సార్' అన్నాడు కొలంబస్‌ని చూసి.

"ఏం బ్రదర్ కులాసానా?"

"ఆహాఁ మీ దయవల్ల. రాత్రి పి. యస్. పి. వాళ్ళ ఫిల్మ కత్తిరించాను. ఇంకోగంటలో ప్రొజెక్షనుంది. ఈలోగా ఓసారి చూదాం వస్తారా" అన్నాడు.

"ప్రొజెక్షనా?....ఎన్నిరీళ్లేం."

"నాలుగు"

"బావుంటుందా."

"నామటుకు నాకు బాగుంది."

"ఫిలిం కాదోయ్, నేను చూడటం. వాళ్ళేమనుకుంటారో అని."

"అదా. ఫర్వాలేదు రండి. మీ బావ వాళ్ళకి బాగా తెలుసు. ఆయన్తో పనుందిట కూడాట."

"అందుకని నన్ను దువ్వుతున్నావా ముందు" అన్నాడు కొలంబస్.

"సార్! దువ్వటం చేతనైతే ఈపాటికి ప్రొడ్యూసర్ డైరక్టర్‌ని అయి ఊరుకుందును....ఊరికే పిలిచాను."

అంతవరకూ వింతగా చూస్తున్న రాజు, అప్పుడు కొలంబస్‌కి గుర్తుకొచ్చాడు.

"ఓ, అయామ్ సారీ....ఈయన రాజుగారు. రాజా! వీరు బాబీగారు అసలు పేరు-నాకు గుర్తులేదు. మేమంతా ఎడిటర్ బాబి అంటాంలే. బ్రిలియంట్ ఫెలో. ఎడిటరన్నమాట" అన్నాడు కొలంబస్ పరిచయం చేస్తూ.

"నమస్కారం" అన్నాడు బాబి.

"నమస్తే సార్ .... అయితే ఎడిటర్జీ, ఎన్. టి. రామారావుకన్న నాగేశ్వరరావు అర్నెల్లు పెద్దవాడని నేనూ, కాదని నా మిత్రుడు ముత్యం వాదించుకుంటున్నాం. మీరెవరితో ఏకీభవిస్తారెడిటర్జీ?" అన్నాడు రాజు.

"బ్రదర్ మిస్టేక్, గ్రేట్ మిస్టేక్. పొరబడితివి. ఈ ఎడిటరు వేరు. ఈయన ఫిలిం పత్రికల ఎడిటరు కాడు. ఉత్తి ఫిలిం ఎడిటరు. ఇక్కడ తయారయే సినిమాల్లో కొంతచెత్త కత్తిరించి మిగతాదాంతో కథలాంటిది చేసి ఇస్తాడన్నమాట. ప్రొడ్యూసరు నీకు వరమిచ్చినా, ఈయనకి గిట్టకపోతే నీకు మామూలుగా దిక్కుండదు. అమాంతం కత్తిరించి అవతల పారేస్తాకంతే. అదీ సంగతి" అన్నాడు కొలంబస్.

"ఓ, తెలిసింది సార్. ఎడిటర్ అంటే జంబులింగం, తిలక్, మాణిక్యం వీళ్ళందరూకదూ. తెలుసునండి, దర్శకులుగా గూడా ప్రసిద్ధి కెక్కిన చలనచిత్ర ఎడిటర్లెవరూ అని మేం అడిగితే సి హెచ్. నారాయణ మూర్తి, తిలక్ అని రిప్లయికూడా వచ్చిందండి—సార్ ఎడిటరుగారూ యక్స్యూజ్‌మీ. ఏమనుకోకు సుమీ? అయామే మిస్టేక్ .... అయితే చలన చిత్ర నటీనటుల భవిష్యత్తు మీచేతులో ఉంటుంది. అంతే నంటారా?"

"మీ యిష్టం. అనమంటే అంటాను." అన్నాడు ఎడిటర్ అతని కేసి చిత్రంగా చూసి.

"పోనీ ఓసారి అందురూ. మీసొమ్మేంపోయె. ఔనుగాని ఎడిటరు గారూ దువ్వడమనగా నేమిసార్. కొంచెం, వివరంగా సెలవిస్తారా?"

"ఆ? ఏమిటి?'' అన్నాడు ఎడిటరు బాబి త్రుళ్ళిపడి. ప్రొడ్యూసరు డైరెక్టరు అయిపోడానికి దువ్వడం రావాలని .... అయామె బ్రిలియంట్ యంగ్‌మాన్....దారుణమైన తెలివి తేటలున్నాయని మాఊళ్ళో అందరూ అంటారండి. ఇది నేర్చుకుని ప్రొడ్యూసరు డైరెక్టరయి పోదామని .... అంతకన్న ఇంకేంలేదు.''

"అది చాలు. ఊహ మంచిదేకాని, మీరడిగిన ప్రశ్నకి జవాబు బాగా తెలీదు కాని, అదుగో ఆ లావుపాటి ఆసామిని చూశారా, ఆయన క్రాపింగు అసలు దువ్వుకోలేదు గదా ఆయన అలా మలుపు తిరిగి వచ్చే లోగా ఏం జరుగుతుందో చూడండి'' అన్నాడు బాబి.

అంతలోకే, అలావుపాటి ఆయనకి ఇద్దరు ఎదురై నమస్కారం పెట్టి, ఏదో చెప్పారు. ఆయన తల తాటించాడు అలాగా అని. వాళ్ళో అరనిమిషం మాట్లాడి వంగివంగి దండాలుపెట్టి వెళ్ళిపోయారు. చూస్తూ వుండగా, ఆయన క్రాపు దానంతటదే సర్దుకుని, నున్నగా దువ్వబడి ముస్తాబై పోయింది. ఆయన మొహం, హీరోయిను పాట అయిపోయి నపుడు వెలిగే హీరో వదనంలా ప్రకాశించింది.

''అదీ దువ్వడం అంటే, మళ్ళీ వాళ్ళచేతుల్లో దువ్వెన వుందా? లేదు. వాళ్ళాయన తలకాయను చేత్తో ముట్టుకున్నారా? లేదు. చూచారా? అయినా ఆయన చింపిరిజీత్తు దానంతటదే దువ్వబడింది. అదీ సంగతి రండి షైమైంది" అన్నాడు ఎడిటరు బాబి.

*　　　*　　　*　　　*

థియేటర్‌లో ఆ నాలుగురీళ్ళూ వేస్తున్నారు.

మొదటి సీనులో నిర్మల బి. య్యే. అనిపించే రకం అమ్మాయి వయ్యారంగా ఉయ్యాల ఊగుతోంది. పెద్ద హాలులో.

''ఆమె రామయ్య అనే రైతు కూతురు నిర్మల బి. య్యే." అన్నాడు బాబి.

''జమీందారు గారింటికొచ్చింది కాబోలు'' అన్నాడు రాజు.

''అబ్బే. వాళ్ళిల్లే. జమీందారు ఇల్లుసెట్టు ఇంకా చిన్నది." అన్నాడు బాబి.

''మరి బీదరైతుకి అంత పెద్ద ఇల్లుంటుందా!'' అన్నాడు రాజు.

''ఉష్" అంటూ రాజు మోచేయి గిల్లాడు కొలంబస్.

''ఏం ఎందుకుండదు? రైతులుమాత్రం మనుజులు కారా. వారికి మాత్రం మేడలు లేవా....సార్! దేశంలో ఇలాంటి భావాలు ఉన్నంత కాలం ఈదేశం బాగుపడదు'' అన్నాడు బాబీ. ఇంకోక్షణం ఆగాక 'అసలింకోటిలెండి. ఇది ఫస్టుసెట్. అందుకని బెస్టుసెట్ వేయించారు. ఆవేళ షూటింగ్‌కి జెమిందారు రోలువేసే ఆయన రాలేదు. అందుకని ఈ సెట్‌ని పేదరైతు రామయ్య ఇల్లులాగా వాడుకున్నారు, అఫ్‌కోర్సు తరువాత కొంచెం మనకి ట్రబులొచ్చిందనుకోండి. డిస్ట్రిబ్యూటర్స్ వేళకి డబ్బుపంపలేదు. అంతలోనే హీరోయిను, హీరో ఇద్దరూ కాల్షీటు ఇచ్చారు. వరసగా త్రీడేసు. ఆ మూడు రోజులూ వాడుకోపోతే, మళ్ళీ మూణ్ణెల్ల దాకా కలిసిరారు. అందుకని సూక్ష్మంలో మోక్షంగా చిన్న సెట్టు వేయించేశారు, జమిందారు ఇంటికి. అంటే కాస్తడబ్బు జాగర్తగావాడే జమీందారన్నమాట. ఇంక ఆ బీదరైతు చూస్తే వాడి అంతస్తుకి తగని మూడంతస్తుల మేడ సెట్‌మీద కాపరం ఉంటున్నాడు గదా చూడండి. ఎంత దుబారా మనిషో. ఈరోజున దేశంలో బీదవాళ్ళే ఎక్కువ డబ్బు ఖర్చుపెడుతున్నారు. ఓమూల ప్రజాళికకు పొదుపుచేసి మిగల్చండని ప్రభుత్వం గోలపెడుతుంటే వీళ్ళు ఇలా ఖర్చు పెట్టడం తగునా .... అందుకే ఈరెండు సెట్టింగులూ జక్‌స్టాపోజుచేసి సిక్స్‌మినిట్ సాంగు పిక్చరైజ్‌చేస్తాం. ప్రబోధం అన్నమాట....బీదరైతుల్లారా! మూడంతస్తుల

మేడలకోసం డబ్బు దండగ చెయ్యకండి. కావలిస్తే ఈ పిక్చరులో జమీందారు కొంప, రైతుభవంతి చూసి బుద్ధితెచ్చుకొండి, అనిచెప్పి హిట్‌లు కొడతాం. ఆపాట ఏరువాక పైపులో రాయిస్తున్నాం లెండి. హిట్ అవుతుంది. తెలిసిందా?"

"లేదుసార్ ఏమీ తెలీలేదు నాకు" అన్నాడు రాజు,

"ఒంటికి మంచిది. మరేం ఫర్వాలేదు" అన్నాడు కొలంబస్.

అంతలోకీ లైట్లు వెలిగాయి.

'అరె సినిమా అయిపోయిందే. మనవేం చూశ్శేదు. ఇంతచిన్న పిక్చరేంటి' అన్నాడు రాజు.

'సారీ, కబుర్ల గొడవలో చూశ్శేదు. ఆపరేటరు నాలుగు రీళ్ళు తీసేశాడు కాబోలు. మళ్ళీ వేయిద్దాం ఉండండి" అన్నాడు బాబీ.

"ఓ రాజా? అదీ సంగతి, అంచేత ఈ తెలివితేటలు నీదగ్గ రున్నాయా? ఆ కథలో వాళ్ళలా నువ్వు అటువంటి సమస్యను అలా ఎదుర్కొనగలవా?" అన్నాడు కొలంబస్ గంభీరంగా అటూ ఇటూచూసి.

'ఇంకా అన్నిలేవు సార్' అన్నాడు రాజు విచారపడి లేస్తూ.

"అయితే యూస్‌లెస్ లాభంలేదు" అన్నాడు కొలంబస్.

"అదేవిటి సార్. మొదట్లోనే లాభంలేదనేస్తే ఎలాగండి."

"రైటేననుకో. ఓ పిక్చరు ఫ్లాపు అయి దెబ్బతింటేనే గాని, అనకూడదు. అది నీ అయిడియాలే" అన్నాడు కొలంబస్.

"అవునుగాని సార్. అడగడం మర్చిపోయాను. ఇప్పుడు మనం చూసిన పిక్చరు పేరేమిటి సార్?"

"బ్రదర్! ఇది బావులేదు. ఒక్క డైలాగులో రెండుసార్లు 'సార్'లు వాడేవు. నువ్వెందుకు పనికివస్తావు?"

"నేనాండి!" అని ఉత్సాహంతో లేచి పోయాడు రాజు. "నేను హీరో, హీరోయిను, రేలంగి, రంగారావు, తంగవేలు వేషములు, గుమ్మడి, పెరుమాళ్ళు లాంటివి, సూర్యకాంతం, వంగరలగా నటించ బడును. ఇంకా డ్యూయట్లు పాడి, రాసి పెట్టబడ గలను. డైలాగులులేని రోలు ఇచ్చినా ముహంనిండా ఫీలింగులు పెట్టేసి అమోహముగా నటించి పెట్టబడును."

"శైరో—ఎరక్క అన్నానయ్యా. ఆ మాట" అని విసుక్కున్నాడు కొలంబస్.

రాజు మనసు చివుక్కుమంది. నొచ్చుకున్నాడు. కాస్సేపాగి, నవ్వుటనభినయించి, 'అయితే ఈ పిక్చరు పేరు చెప్పారు గారు' అన్నాడు వినయంగా.

కొలంబస్‌కి జాలేసింది.

తారక మంత్రం ఉపదేశిస్తున్న సన్యాసిలా మందహాసం చేసి, వాత్సల్యంతో రాజు వీపు తట్టాడు.

"నాయనా రాజా. ఎంత అమాయకుండవు .... ఆలకించు. మనం దేముళ్ళని రాముడనీ, కృష్ణుడనీ, అల్లా అనీ, ఇల్లా అనీ పిలుచుకుంటాం. పేరు వేరుగాని, దేముళ్ళందరు లేరు. ఈశ్వరు డొకడే. అతనికే అనేక రూపాలు, అనేక నామాలు. అతను మన సినిమాల్లాగే ఆది మధ్యాంత రహితుడు. నాయనా రాజా! మన సినిమాలలో ఈ ఈశ్వరదర్శన రహస్యం దాంకుని వుందన్నమాట. ఇదీ సరిగ్గా అంతే. "సుబ్బలక్ష్మి" అంటావు ఓ సినిమాని. "సూరజ్" అంటావు మరోదాన్ని. 'ముఝే న భూలో' అంటావు ఒక సోషల్‌ని. అలాగే బంగారుపువ్వు, వెండిబండి, అట్టబుట్ట, చెమ్మచెక్క ఇలా సవాలక్ష పేర్లు. కాని, సినిమాలో? అవన్నీ ఒకటే గదా. వాటికి భాషా ప్రాంతం అనే బేధాలు లేవుగదా. విన్నా

రేపూ అనే తేడాలు లేవుగదా. మొదలూ, తుదీ, తలా తోకా అనేపట్టింపులు లేవు గదా. నువు ఓ పిక్చరు మాటినీ ఆట చూస్తావు. రెండో ఆట ఇంకోచోట చూడు. మాటనీ ఆటలో ఆఖరిసీనుతో ఇది మొదలవుతుంది. దాని మొదటిసీనుతో ఆపుజేస్తారు. నాలుగురీళ్లు సుఖపడితే ఆరు రీళ్ళు వేడి కన్నీళ్ళు. మధ్యమధ్య నాలుగురీళ్ళ హాస్యపు పన్నీళ్లు. ఇంకో రెండు రీళ్ళలో కథ ఆపుచేసి, జనాన్నవతలికి వదలిపెట్టేస్తారు. ఇంతేగదా, నాయనా" అన్నాడు కొలంబస్.

"ఇంతే ఏమిటంటి. నాబొంద. నాకు పోర్షను ఇవ్వకుండా శివాజీ గణేశనంత డైలాగు మాట్లాడారు" అన్నాడు రాజు విసుగ్గా.

"సరిగ్గా ఇంతే బ్రదర్. ఎడిటింగు అంటే ఇదే. నీకు ఉందను కుంటున్న పోర్షను పిక్చరు విడుదల అయేదాకా ఉందని గారంటీ లేదు. సినిమాలో నీగూబ గుయ్యిమనేలా ఎవడో కొట్టాడనుకో ఎవరో పెద్దస్టారు సీతాలూకు బాధను క్లోజప్‌లో నటిస్తాడు. నిన్నెవడో తిట్టాడనుకో పెద్ద వాళ్ళెవరో కోపం నటిస్తారు. ఆఖరికి నీకాలు జారిందనుకో నీబదులు ఇంకెవరో పడతారు. వీటినే 'ఫిట్టింగులు' అనబడునులే. ఇందాక అడిగావుగా అందుకు చెప్పాను. అలా కోడిలా చూడకు నాకేసి—" అన్నాడు కొలంబస్.

రాజు, భయపడ్డ కోడిలా చూస్తున్న మాట నిజమే. కాని, ఆ చూపుల చివర కొలంబస్ లేడు. అవి అతన్ని దాటి పోయాయి. మాంఛి కష్టాల ఘట్టంలోవున్న కారెక్టర్ యాక్టర్‌లా రాజు నిర్వికార వదనుడై, నిశ్చేష్టుడై, నిర్విణ్ణుడై చూస్తున్నాడు.

రాజు ఆలోచనలో పడిపోయాడు. కొలంబస్ అతని భుజంతట్టి లేవదీశాడు. లేస్తూనే కళ్ళునులుపుకొని "సారీ" అన్నాడు రాజు.

'ఏం గిరాకి, ఏమిటంత దీర్ఘాలోచన?' అన్నాడు కొలంబస్.

'అబ్బే ఆలోచనకాదు. అది మనకసలు అలవాటు లేదు. మీరే ఏదో చెప్తానన్నారుగా మరోకథని.'

"ఆ ముక్క నేననందే. వెంకటరమణ ఖాబోలు. వాడేనా పొర బాటున మరోసారి పైకథ అనబోయి, పైమరోకథ అన్నాడుగావును. ఔను గాని——"

చూస్తూవుండగా రాజు బిర్రబిగుసుకుపోయాడు. తెలుగు సినిమాలో కష్టాలు భరిస్తూ, చీవాట్ల డైలాగులు వింటున్న మంచిపాత్రలా ముక్కుపుటాలు పూరించాడు. మోర పైకెత్తాడు. ఆనక ఊపిరి బిగపట్టాడు. లాంగ్‌షాట్‌లోంచి చూస్తే రవివర్మ విశ్వామిత్రుడి ఫక్కీలో తయారయ్యాడు.

'అదేం అలా అయిపోతున్నావు? ఫిట్లొస్తాయా' అన్నాడు కొలంబస్. రాజు మాట్లాడలేదు. తక్షణం, సూక్ష్మబుద్ధి కొలంబస్ క్షణంలో నలువంకలా పరకాయించి, పాతిక ముప్పైగజాల దూరాన మేనక ఉందని పసిగట్టాడు.

ఆ మేనక, ఫుల్ కాస్ట్యూమ్‌లో ఉంది. ఏ పిక్చరులోదో తెలీదుగాని, జనరల్ అప్సరస అనుకుంటే ఇబ్బంది లేదు.

కొలంబస్, ఆప్యాయంగా, ఆమెవంక చూసి చిరునవ్వు విసిరాడు. మేనక రుసరుస లాడి, ''నువ్వుకాదు నీపక్క వాడిని ఇటు చూడమను" అన్న భావానికి అభినయంపట్టింది.

'వీడా' అని ప్రతిసంజ్ఞచేశాడు కొలంబస్.

ఔను మరే అంది మేనక తల.

'నిన్నుట' అన్నాడు కొలంబస్ రాజువంకచూసి. 'నిన్నే' అన్నాడు ఇంకోక్షణం ఆగి;

'నీ దుంపతెగ! అసాధ్యుడిలా ఉన్నావే. ఊళ్లోదిగి 24 గంటలన్నా కాలేదుగాని, అప్పుడే పిల్లని పట్టడం, విడవడం, బడాయిపోడందాకా వచ్చేశావే. ఓ దుష్యంతుడా! భరతుడు కనబడడేల?" అన్నాడు ఆనక.

'గురూ' అన్నాడు రాజు ఆపాదమస్తకం తలత్ మహమ్మద్ కంఠంలా వణికిపోతూ.

"మలేరియావా?" అన్నాడు కొలంబస్.

"కాదు. లక్ష్మన్నరసు. ఎగస్టారి. షి ఈజే వాంటింగ్ టు హీరోయిన్ మీ. అంచేత డోంటు సీ. అటువేపు చూడకండి'' అని ప్రాధేయ పడ్డాడు రాజు.

కొలంబస్ దూరాన వున్న మేనక, లేక శకుంతల వేపు చూశాడు; రాజుని క్లోజప్‌లో పరిశీలించాడు. 'హారి పిడుగా, మొత్తానికి కథకుడివే సినిమాకథంత పనిచేశావు,' అన్నాడు పుత్సాహంగా.

"నో సార్. కథకుడు కాదండి నేను. అయామ్ వాంటింగు టు హీరో—"

'సర్లేవయ్యా. నిన్ను బెల్లించి ఇపుడెవడూ రైటరుగా బుక్ చేసెయ్యడులే. గ్రంథ సాంగుడివేనూ అంటున్నా.'

'గ్రంథ సాంగ్సు ఎప్పుడూ రాయలేదండి. రాయగల ననుకోండి.'

'భేష్ అలాగే. ఇప్పటి కీ చర్చ నిక్కడ వదిలెయ్యి. ఆ అమ్మ దెవరో పిలుస్తోంది గాని వెళ్ళి మాట్లాడు.'

'నోనోనోనో. ఇపుడొద్దండి డేంజర్. ఆ అమ్మాయి మంచిపిల్లే. కాని, పాపం నాతో హీరోయిను వేస్తానంటుంది. నేను చూస్తే పాపం— ముందరే ఇంత చిన్నవాళ్ళని ఎలా ఎంకరేజి చేస్తాను? అయామే హీరో అఫ్ సిక్స్ డ్రామాస్. భయపడుతుంది కదా. స్టార్ వాల్యూ కూడా లేదు.

ముందర ఏ అంజలీ, సావిత్రీ, వైజయంతిమాలా వాళ్ళతోనో నాలుగైదు పిక్చర్లు వేశాక చూస్తానన్నాను. లక్ష్మన్నరసు ఇపుడే వెయ్యమంటుంది. యూ వోన్‌లీ టెల్మీ. మీరేచెప్పండి నాకు. హౌ కెన్ ఐ యేబుల్. నేనెలా—"

"నామాట విని నువ్వు మీ ఊరి డేరాహాలులో ట్రాన్లేటరుగా చేరిపోరాదూ?'' అన్నాడు కొలంబస్ సిగరెట్ ముట్టిస్తూ.

"నో సార్. కాదండి"

'స్టాప్ — ఆగు — ఆ పిల్లసంగతి చూస్తావా లేదా? నేనే చూద్దును గాని, కొంచెం భయంగా ఉంది. ఆ స్టుడియో కంకణాలతో కొడుతుందని ....అవి పాడై పోతాయి గదా అందుకు.'

'డోంటంటే డోంటేనండి. మనతో ఒకటేమాట. మనం ఇట్నుంచిలా పోదాం రాండి' అన్నాడు రాజు వెనక్కి తిరిగి కొలంబస్ చెయ్యిపట్టుకు లాగుతూ.

*　　　*　　　*　　　*

"పిలుస్తూంటే నీగ్గాదూ? యాడకి లగెత్తుండావ్" అని కంచుగంట మోగింది రాజు చెవులో.

జంకుతూనే వెనక్కి తిరిగాడు రాజు 'డటీజ్‌నాట్. అది కాదు నర్సూ' అంటూ సంజాయిషీ ఆరంభించాడు దగ్గిర కొచ్చేసింది గదా అని.

"ఇదిగో బుల్లోడా? అలాటి ఎంగిలి కూతలు కుయిమోక నాకాడ. అడిగిందానికి జవాబియ్యి. గంటనించి జెబ్బలొడి పొయ్యేలా పిలత్తావుంటే, పల్లకుంతావేందీ అంట" అంది నరసు దమాయింపుగా.

రాజుకి ముచ్చెమటలూ పోసేశాయి. అల్లంతదూరాన అంజలీదేవి, నాగేశ్వర్రావు, రేలంగి, ఇంకా ఎవరెవరో వేషాల్లో నడిచి వెళ్తున్నారు.

[21]

ఆటోగ్రాఫుల పుస్తకం ఉంటే, అందరి సంతకాలూ సంపాయించేదుం గదా అనుకున్నాడు. అంతలో గుండె గుభేలు మంది. వాళ్ళు ఇటే చూస్తున్నట్లున్నారు.

'అయ్యబాబోయ్ ఇంకేమైనా వుందా. వాళ్ళు చూసి గుర్తు పట్టేస్తే' —అనుకున్నాడు.

మరో స్టుడియోలోంచి సావిత్రీ, ఎన్. టి. రామారావూ వస్తున్నారు.

ఓరి బాబోయ్ వీళ్ళిటూ, వాళ్ళటూ. ఎలాగా! లక్ష్మన్నరసో, తనో ఇద్దరూనో అమాంతం మాయమైపోతే బాగుండునని ఆశ పడ్డాడు రాజు. తెరవేలుపులు ఎడనించీ పెడనించీ దగ్గిరికొచ్చేస్తున్నారు. రాజుకి ఉపాయం తోచలేదు. కొలంబస్, కిరాతార్జునీయంలో వరాహంలా—ఇతడికి రెండు తలలా? అనిపించేటంత వేగంగా ఇటూ అటూ, అటూ ఇటూ చూస్తూ ఆ గ్రూపుకీ, ఈ గ్రూపుకీ నమస్తేలు విసురుతున్నాడు. ఏ ఒకటేనా తగలక పోతుందా అని.

రాజుకి మతిపోతోంది. 'క్లైమాక్సు సీనులో బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్కులా' చెవులు హోరుమంటున్నాయి. "ఇంకేముంది. అంజలీ, సావిత్రీ వాళ్ళూ నన్ను ఇక్కడ – ఇలా యీ ఎగస్ట్రాల్తో చూసేస్తే, తరవాత హీరోయిను వెయ్యనంటారు. వాళ్ళు హీరోయిను వెయ్యకపోతే నేను ఎన్ని హీరో రోళ్ళు వేసి ఏంలాభం మనసా!" అనుకున్నాడు. అందుకని తక్షణం రంగు ఫిరాయించేశాడు.

'హూ ఆర్ యూ—లక్ష్మన్నరసూ? వాటీజ్ యువర్ నేమ్? నీ పేరేమిటి?' అన్నాడు వీలైనంత గట్టిగా, గంభీరంగా చుట్టుపక్కల అందర్నీ ఆశ్చర్యపరిచేటంత బెట్టుగా.

'ఏందీ?....ఏందీ. నీపేరేటా....వారినీ. బలేవోడివే—నీసిగ్గు సట్టు బండలుగాను' అంది నరసు విరగబడి నవ్వుతూ.

'వాళ్లు', వీళ్ళవంక చూడకుండానే ఇందాకా రాకుండానే పదిగజాల అవతల ఉన్న ద్వారంలోంచే అటే వెళ్ళి పోయారు, తీరా.

కొలంబస్ కూడా స్థిమితపడి సర్దుకుని, అలవాటు ప్రకారం టెక్కు నటించి, వీళ్ళలోకంలోకి వచ్చాడు.

రాగానే అతని కంటికి ఆనింది పంచకల్యాణి గుర్రంలా ఉన్న లక్ష్మీనరసు.

'సో! పేరు లక్ష్మీనరసు అన్నమాట' అన్నాడు చనువుగా.

'మాటాలేదు గీటాలేదు....నాపేరు ఏదో ఓటి. నాతోటి నీకేటి మద్దిన.' అంది నరసు రుసరుస లాడుతూ.

'ఓరబ్బో. గుర్రం కట్టెయ్ మరి. ఎవరితో మాట్లాడుతున్నావ్ తెలుసా? అయామె ప్రొడ్యూసర్స్ బ్రదరిల్లా' అన్నాడు కొలంబస్ కొంచెం కోపంగా.

"ఒస్సీ....నాకు తెల్దేటి నీ బెదరిల్లాతనం. ఒగ్గెయి కోతలు .... అవునుగాని రాజా! మద్దినాల కూడుదిని నాతో సూటింగ్ కొత్తానన్నావు.... అదే పోవడమా. ఇంకా తిన్నావా లేదా. ఇలాటోల్లతో తిరిగితే ఏటి లాభం. కూడా గుడ్డా" అంది.

'నన్ను మన్నించు నరసూ' అన్నాడు రాజు పశ్చాత్తాపంతో కుమిలిపోతూ.

ఈలోగా కొలంబస్ ఇకిలించి, మెళ్ళో ఒంటిపేట రోల్డుగోల్డు గొలుసు షోగ్గా మెలిపెట్టి తిప్పుకున్నాడు. బంగారపు ముందరిపన్నూ, ఈగొలుసూ రూపంలో ధైర్య సాహసాలను ప్రదర్శించి, జేబులోంచి పదిహేను రూపాయల వాక్స్వాతంత్ర్యాన్ని, తీసి లెక్కవేసినట్టు చూసి, పొడిదగ్గు దగ్గి, నరసుకు దగ్గిరగా జరిగి "అయితే లక్ష్మీ ఇవాళ కాల్‌షీట్

ఎక్కడ?—అదే ఏ పిక్చర్లో" అన్నాడు ఆప్యాయంగా భుజంమీద చేయి వేయబోతూ.

రాజాకి అతని తరహా నచ్చలేదు. కాస్త మోహమాటం, కొంచెం భయం వేసినా తెగించి, 'యూ సీ, కొలంబస్ గారూ. అయామ్ — నేను, నేనూ నరసూ — అయి మీనూ — మీరలా ముట్టుకోకండి' అని నసుగుతున్నాడు.

నరసుకి అంతకన్నా నచ్చలేదు కొలంబస్ చొరవ. అందుకని, కొలంబస్‌కు సంబంధించినంత వరకూ, రాజ్యాంగంలో వాక్స్వాతంత్ర్యానికి సంబంధించిన సెక్షను పావుగంటదాకా పని చేయడానికి వీల్లేనంత పవర్‌ఫుల్‌గా పుర్రచేత్తో జవాబిచ్చి, "మాపిడేలకేనా కొంపదేరు" అని రాజుని పురమాయించి చరచర నడిచి వెళ్ళిపోయింది.

*   *   *   *

'చురుకుపాలు ఒక్కరవ్వ ఎక్కువున్నట్టుంది?' అన్నాడు కొలంబస్ పావుగంట తరువాత తేరుకుని.

'యస్సార్' అన్నాడు రాజు దిగ్భ్రాంతుడై.

'ఏమి యస్సారు మీబొంద? గూబ గుయ్యిమంది సార్! పైపెచ్చు పరువుపోతేను. ఎవరెవరు చూశారో ఏమిటో' అన్నాడు కొలంబస్ చుట్టూ కలయజూసి.

'నో సార్' అన్నాడు రాజు కంగారుపడి.

కొలంబస్‌కి ఒళ్ళు మండిపోయింది. 'షటప్' అన్నాడు దూకుడుగా.

'ఆల్‌రైట్ సార్' అన్నాడు రాజు బిక్కమొహం పెట్టేసి.

ఒక నిముషం ఎవరూ మాట్లాడలేదు.

'కాఫీ తాగుదాం పద' అన్నాడు కొలంబస్.

కూలబడి మంచినీళ్లు తాగాక, 'ఇంతకీ అమ్మాయి ఎవరు మీ చుట్టాలా?' అన్నాడు కొలంబస్.

రాజు మొహంలో చిన్నసైజు దీపంలాంటిదేదో వెలిగి ఆరి పోయింది. ఆలోచించాడు. తటపటాయించాడు. చివరికి తెగించి 'ఔను సార్' అనేశాడు తలవంచుకుని ముసి ముసి నవ్వులు నవ్వుతూ.

'ఏమిటలా సిగ్గుపడి పోతున్నావు. కొంపతీసి ప్రేమించావా ఏమిటి?' అన్నాడు కొలంబస్ ఉత్సాహంగా.

'ఔను సార్. యస్.' అనేసరికే, నవ్వు అతని పెదిమల సరి హద్దు దాటిపోయింది. బలవంతాన ఆపుకుంటున్నాడు. ఆనందాన్ని, ఉత్సాహాన్ని అదుపు చెయ్యలేక భుజాలు నానా అవస్థా పడుతున్నాయి.

'అలా భుజాలెగరెయ్యకు. జడ్డివాడను కుంటారు ఎవరైనా.... పెళ్ళాడు తున్నావా? లేకపోతే టెంపరరీ లవ్వేనా?'

'పెర్మనెంటే నండి'

'ఎప్పణ్ణించి'

'నిజం చెప్పాలంటే ఇందాకనించేనండి. మిమ్మల్ని ఇలాచేత్తో అనలేమూ—'

'ఇలా అనడం ఏమిటి నీ తలకాయ. చెంప ఛెళ్ళుమంది. గూబ గుయ్యి మంది—' అన్నాడు కొలంబస్ చెంప తడుముకుంటూ. రెండు గుక్కలు కాఫీ తాగేదాకా కొలంబస్ మళ్ళీ ప్రసన్నుడు కాలేదు. అయ్యాక, రాజు భుజం తట్టి, 'అయితే, మరి యిందాక ఆపిల్లని పలకరించడానికి ఎందుకు సిగ్గుపడ్డావు?....ఎవరన్నా చూస్తే పరువు పోతుందని భయమా?' అన్నాడు.

రాజు సిగ్గుపడ్డాడు. యస్సార్ అయామె హీరో బికాజ్....అందు కనండి. కానీ అది ఇపుడే వేస్తానంటుంది నాతోటి. నేను చూస్తే సావిత్రి వాళ్ళతో తప్ప హీరో వెయ్యను గదా. దానికి చెప్తే తెలీదు. షి డోంట్నో బట్ హౌ .... అదంటే నాకు ఇష్టమే కాని, బట్ హౌ కెనై పాసిబుల్ హియర్. దటీజ్ బికాజ్ అంచేత అదీ కథ!' అన్నాడు రాజు వుద్రేకంగా.

'బ్రదర్ నువ్విక్కడ తప్పబుట్టావు. అమెరికన్ పిక్చర్లలో వెయ్యాల్సిన వాడివి .... సర్లేగాని, డబ్బేమాత్రం ఉంది?'

'ఇక్కడ జేబులో ఏంలేదండి. కొంచెం ఉంటే పొద్దున్న ఫీజు కట్టేశానండి. మరి నా పెట్టీ బేడా పేపరాఫీసులో ఒదిలేశాను గదండి.'

'వెరీగుడ్! ఒక్కడుగు వెళ్ళొద్దాంరా చెబుతా. నాదగ్గర చెక్కుంది రేపుగాని మారదు.' అంటూ లేచాడు కొలంబస్. ఐదు నిముషాలలో ఇద్దరూ ఇవతలి కొచ్చారు. కొలంబస్ దర్జాగా టాక్సీని పిలిచాడు.

*   *   *   *

పేపరాఫీసులో ఎవరూ లేరు. కుర్రాడు కునికిపాట్లు పడుతున్నాడు.

కొలంబస్, రాజు లోపలికెళ్లారు. 'అన్నట్టు మర్చి పోయానండి—ఈ పెట్టె నాదికాదు. రైల్లో మారిపోయి ఎవరిదో నాకు వచ్చేసింధి.' అన్నాడు రాజు.

"నిజం! లక్కీఫెలో. బహుశా దీన్నిండా నీకదృష్టం ఉంటే—"

"దీన్నిండా పాత పేపర్లున్నాయనుకుంటా"

'నాన్సెన్స్. అదృష్టం ఉంటే, అవి నోట్లకట్టలై పోవచ్చు. బంగారునగలు కావచ్చు.'

"లేకపోతే?"

'నీకర్మం. ఆడదాని శవం ఉండొచ్చు. చావుబాజా, గావుకేక, కాయ్‌రాజా నవలల్లో శవాలన్నీ పేర్చి ఉండొచ్చు. తెరు తెరు" అన్నాడు కొలంబస్ ఆశగా లొట్టలు వేస్తూ.

తాళంచెవి అక్కరలేకుండానే పెట్టెమూత వచ్చేసింది. దాన్నిండా కాళీస్థలం, అందులో ఓమూల ఓపచ్చ బేడకాసు ఉన్నాయి.

రాజు కొంచెం ఆశ్చర్యపోయాడు బేడకాసు దొరికి నందుకు. కొలంబస్ కొయ్యబారిపోయాడు, బేడే ఉన్నందుకు; టాక్సీవాడు బయట ఉన్నాడని గుర్తుకురాగానే'.

ఒక క్షణానికి తెప్పరిల్లి, హారినీ ఇదేనా: 'పెట్టేబేడా' పేపరాఫీసులో ఉన్నాయన్నావు' అంటూ విరగబడి నవ్వసాగాడు.

కొంతసేపటికి రాజుకుకూడా అందులో షోకు తెలిసింది. 'మరే: పెట్టే బేడా?' అంటూ పెట్టి పైకెత్తి ఆడించి బేడచేసే చప్పుడువింటూ ఎంతో సంతోషంగా నవ్వాడు.

'ఇడియట్' అన్నాడు కొలంబస్ నవ్వాపుకుని కళ్ళ నీరు తుడుచుకుంటూ.

'నక్క మాటలను
వినని గాడిదకు
డొక్క బద్దలై పోలేదా?'

(—పంచతంత్రం)

'కిం కర్తవ్యమ్' అనుకున్నాడు కొలంబస్. ఓ క్షణం ఆలోచించి, 'భజగోవిందం' పాట తెలుసా, 'భ్రాజమానం?' అన్నాడు రాజు భుజం తట్టి.

'గ్నాపకం లేదండి'

'భేష్. దార్లో కొస్తున్నావు. ఏది అడిగినా, 'రాదు' అనరాదు. గుర్తులేదు అనాలి, అన్నపాఠం వంటబట్టిందన్నమాట. సినిమాకి పనికొస్తావు ఫరవాలేదు....సరేగాని టాక్సీ డ్రైవరు సంగతేమిటి?'

"టాక్సీ డ్రైవరు చిత్రములో దేవానందూ వానియొక్క భార్య కల్పనా, బ్రాకెట్టు కార్తిక బ్రాకెట్టు అనందూ నటించిన ఈ చిత్రానికి—'

'ఆగు. అదికాదు. మనగుమ్మంలో మనకోసం కాసుకూచున్న యొక్క టాక్సీ డ్రైవరు సంగతి. వాడికి డబ్బివ్వకపోతే తోలు ఒలిచేస్తాడు.'

'ఎవరిదండి?' అన్నాడు రాజు.

"నీదే"

"అయ్యబాబోయ్ అలాగా?....డబ్బు లివ్వకపోతే మనని ఇంక ఎక్కనివ్వడా?"

"నిక్షేపంలా ఎక్కనిస్తాడు కాని మళ్ళీ దిగనివ్వడు."

'మీ బావగారు ప్రొడ్యూసరుగారు కదాండి. అక్కడి కెళ్ళమని, గట్టిగా అరుద్దాం....డబ్బులిస్తారు. అప్పుడేమో—'

'ఊహ మంచిదే. కాని, మా బావకి నేను కనబడితే నాగ్గూడా డొక్కచీల్చి డోలు కట్టిస్తాడు. పొద్దుట ఆయన ఓ చెక్కిచ్చాడు. తీరా అది మార్చేసరికి ఒక .... ఒక ఆడ్రెండు అప్పుతీసుకుంది.'

'అలాగాండి .... మరి మీ బావకి చెప్పేస్తే ఆవిడ మళ్ళా యిచ్చేస్తుందని?'

'ఆవిడ మళ్ళా ఇవ్వదుగా. అప్పుతీసేసుకుంది'

'ఓహో అదాండి. మీరే ముందస్తుగా బాకీ అన్నమాట. భలేవారే.'

'షటప్.'

'యస్సార్'

*　　　*　　　*　　　*

ఐదు నిమిషాలయ్యేసరికి బయట కారు హారన్ మోగడం మొదలెట్టింది. ఇంకో నిముషానికి టాక్సీడ్రైవరు తల తొంగిచూచి తప్పుకుంది.

'బ్రదర్ లాభంలేదు .... లే' అన్నాడు కొలంబస్ నిట్టూర్చి.

'వెళ్తే ఎలాగండి. వాడు తోలు ఒలిచేస్తాడన్నారు గదా?'

'ఔను దానికేం చేస్తాం. వాడిష్టం'.

'అంటే, నన్నేగా వాడు—'

'మరే నిన్నే.'

'అయ్యబాబోయ్. ఎలాగండి ఐవిల్ హోల్డు యువర్ లెగ్స్. మీకాళ్ళు పట్టుకుంటాను. దీజార్ నాట్ యువర్ హాండ్స్. ఇవి మీ చేతులుకావు' అన్నాడు రాజు బెంబేలెత్తి పోయి.

'నావి కాపోతే నీవా .... షటప్'

"యస్సార్".

తనమీద కాస్సేపు జాలిపడ్డాక రాజు మీద పడ్డాడు కొలంబస్. ఆనక తను లేచి, రాజును లెమ్మని భుజం తట్టాడు. లేచి పెట్టెపట్టుకు బయల్దేరమన్నాడు. మళ్ళీ "ఒద్దులే .... నేనే పట్టుకుంటాను. నీకింతా

చేతకాదు. చిన్న నటుడివేగా" అంటూ తనే పెట్టె పట్టుకుని రెండడుగులు వేసి, మళ్ళీ వెనక్కొచ్చి, పెట్టెతెరచి, అందులో విచ్చబేడ తీసి జేబులో పడేసుకు, పెట్టెమూసి బయల్దేరాడు. రాజు, వెనకే భయపడుతూ వస్తున్నాడు.

గుమ్మంలో టాక్సీ డ్రైవరు ఎదరై "ఎన్నాసార్" అన్నాడు విసుగ్గా.

కొలంబస్ ధీమాగా నవ్వాడు; "వెయిటింగ్ ఛార్జెస్ ఇస్తాను లేవోయ్ డబ్బుతో పనిమూలానా లేచ్చెంది" అంటూ; తక్షణం, కొలంబస్ చాలాబరువైన పెట్టె మోస్తున్నాడని డ్రైవరుకి అనిపించింది.

'ఇబిడీ తళ్లంగె' అన్నాడు ఆ పెట్టెని అందుకోబోయి.

'హ్హామమ్మ, నువ్వొద్దు. వేండా. నాన్ మొయ్యరే. నేనే మోస్తాం. లే!' అంటూ బరువు మొయ్యడాన్ని అభినయించి, కారులో కూర్చున్నాడు.

"ఫో నేరా ఫో" అన్నాడు. కొంతసేపటికి దీపాలు వెలిగాయి.

* * * *

'అంగెనిల్లు' అన్నాడు కొలంబస్ ఓ ఇల్లు చూపించి. ఆయింటి దగ్గిర బండి ఆగింది.

'ఇరు' అన్నాడు కొలంబస్ కారుదిగుతూ. రాజు ఎడంచేత్తో అవలీలగా ఆపెట్టె తీసెయ్య బోయాడు.

కొలంబస్ ఛెళ్ళున అతని చేతిమీద ఓటివేశాడు. 'ఆపెట్టెని ముట్టుకోవద్దన్నానా, డబ్బా మరోటా! బరువు. ప్రతిచోటకీ దాన్నేం మోస్తావు' అని మందలించాడు.

'అందులో —' గొణగ బోయాడు రాజు.

'మరేం ఫర్వాలేదు. ఈ బండి నాకు తెలుసులే' అంటూ చరచర రాజుని ఈడ్చుకుపోయి ఓ యింట్లో ప్రవేశించాడు కొలంబస్.

లోపల ఎవరో మీసాలతనూ, ఇతనూ 'టార్జాన్ యండ్ ది జంగిల్ టౌన్' లో జానీ విసిముల్లర్ కన్న, తరవాత టార్జానులు వేసిన లెక్స్ బార్కర్ ఎంతగొప్పవాడూ అన్న విషయమై పది నిముషాలు గుసగుసలాడుకున్నాక 'ఎడిటర్జీని' ని అడక్కుండానే ఏకీభవించేశారు.

'ఇట్నుంచి అవతల వీధిలోకి దారుందా' అన్నాడు కొలంబస్.

'ఓ' అన్నాడు గూటంలా ఉన్న ఆ మీసాల అతను.

'కమ్' అన్నాడు కొలంబస్.

రాజూ అతనూ పెరటి గుమ్మంలోంచి ప్రక్కవీధిలోకి వెళ్ళిపోయారు.

'పెట్టో?' అన్నాడు రాజు.

'పెట్టి వాడికీ, బేడ మనకీ' అంటూ నవ్వాడు కొలంబస్.

* * * *

టాక్సీవాడు 45 నిమిషాలు కూర్చున్నాడు. బీడీలు అన్నీ అయిపోయాయి. లేచి, వెనక సీట్లో పెట్టె వంక నిశితంగా చూశాడు.

మళ్ళీ కొలంబస్ ప్రవేశించిన ఇంటివైపు చూశాడు.

పెట్టి తెరిచి చూస్తే బాగుండదు.

చూసేదేముంది. తెలుస్తూనే వుందిగా అనుకుని, మెల్లిగా టాక్సీని పదిగజాల దూరం తోసుకుపోయి అక్కడ లోపల కెక్కి ఇంజన్ స్టార్టు చేసి తుర్రుమన్నాడు.

'ముతాల్ పసింగో....అప్పుడీ కూడ, నాల్పత్తంచి నిమిషం నా మరియాద గత్తానె ఇరిండె. ఇదుకు మేలె ఎవనాలె ముడియం. ఇదిపోరుం .... ఇది నమ అదిష్టం' అనుకున్నాడు వెనక సీటులో పెట్టకేసి ఆప్యాయంగా చూస్తూ.

* * * *

రాజూ, కొలంబస్ మళ్ళీ కాఫీ హోటల్లో దూరారు.

"ఏం? దిగులుగా వున్నావు? జీవితం బాగులేదు?" అన్నాడు కొలంబస్ తన విజయానికి మురిసిపోతూ.

"ఏంలేదు. ఇందాకట్నించి ఆలోచిస్తున్నాను. పాపం లక్షిన్నరసుని అలా అవమానం చేసేశానే అని. ఎంత కృతఘ్నుడిని అనుకుంటుందో! నేనే, ఎమ్మెస్ రామారావునైతే పెద్ద బాక్రగౌండ్ సాంగ్ పాడేవాణ్ణి. ఇంక అసలిలా చెయ్యను. అది చెప్పినట్టే వింటాను. ఇద్దరం కలిసే గొప్ప వాళ్ళం అవుతాం——" అన్నాడు రాజు.

కొలంబస్ జాలిగా నవ్వాడు. 'బ్రదర్ వట్టి భ్రమ. అదెందుకు నిన్నెందుకు చేరదీసిందో నాకు తెలీదు కాని, రేప్పొద్దున్న అదికనక రెండు పిక్చర్లలో హీరోయిను అయితే, మొట్టమొదట మెడ పట్టి గెంటించేది నిన్నే. టోకరా ఇచ్చేది నీకే. అనుభవం మీద చెబుతున్నాను. ఎప్పుడూ ఇంకోళ్ళతో కలిసి పైకి రావాలని ఆశపడకు. పైకెక్కే వాడి పక్కన నించుంటే వాడెప్పుడూ నీనెత్తిని కాలు పెట్టి ఇంకో మెట్టెక్కాలని చూస్తాడు. అవసరం వస్తే అందుకు సందేహించడు. సినిమాలేకాదు, ఎక్కడేనా అంతే. ఇంతెందుకు ఓ కథ చెప్తాను విను.

చాలాకాలం క్రితం రాజారావు, రామారావు అని ఇద్దరు బావమరుదు ఉండేవారు. ఇద్దరూ నెల్లాళ్ళు అటూ యిటుగా హాలీవుడ్ వచ్చారు సినిమాలో చేరాలని. రాజారావు చిన్నచిన్న వేషాలు సంపాదించడం మొదలెట్టినా, రామారావు ఇంకా వీధులవెంట తిరిగేస్థితిలోనే ఉంటూ

వచ్చాను చాలా రోజులు. నిజానికి ఇతను ప్రజ్ఞానవంతుడు, కథలూ, పద్యాలూ, పాటలూ అవి రాయడంలో కాస్త చెయ్యి తిరిగిన వాడు. నాటకాలు వేసి, నటనలో కూడా అనుభవం సంపాదించాడు. వీటికన్న ముఖ్యం, అతని తెలివి తేటలు. అందువల్లనే అలా అవస్థ పడేవాడనుకో.

రాజారావుకి బతుకుతెరువు తెలుసు. ఎవరో డిస్ట్రిబ్యూటర్లనీ, మంచిచేసికొని వాళ్ళవాడుగా ఉంటూ, వేషాలు సంపాదించేవాడు. సాధారణంగా సినిమాలో కథ ఆరంభం కావడానికి మొదట్లోనే చచ్చిపోయేవాళ్ళ వేషాలు దొరికేవి. అలాఉండగా ఒక టమిల్ పిక్చర్ డబ్ చేసే బేరం వచ్చింది. డిస్ట్రిబ్యూటర్లకి 'గౌరవ—అడ్డమైనవాడూ' అయిన రాజారావు ఆ బేరాన్ని సంపాదించాడు. రచన, డబ్బింగు, డైరెక్షను డైలాగులు చదవడం గట్రా అన్నీ తనే చేసేటట్టు ఒప్పందం. మీరు రాసినవేమన్నా ఉంటే చూపించ మన్నారు వాళ్ళు. మనవాడికి పొట్టకోసి సెర్చిలైటు వేసి వెతికితే అక్షరం ముక్క కనబడదాయె. ఇప్పుడే వస్తానుండండి అని చెప్పి, రామారావు రూముకి వెళ్ళి, అతగాడు రాసిన పుస్తకాలూ అవీ పట్టుకొచ్చి చూపించాడు. వాటిమీద టి. ఆర్. రావు అని పేరు ఉంది. రామారావు ఇంటిపేరు 'టి' వారులే అందుకని అలా వేయించుకున్నాడు. చిక్కు, రాజారావు లక్కు ఎక్కడంటే, రాజారావు ఇంటిపేరుకీ కూడా 'టి' అనే అక్షరంతోటే మొదలవుతుంది. అందుకని, వీడూ టి. ఆర్. రావు అవుతాడు గదా. సరే కాంట్రాక్టు రాసుకున్నారు. ఇప్పుడు డైలాగులు రాసేవాడెవడు? పరాయి వాడికి తెలిస్తే చిక్కని, అతను రామారావునే కూర్చోబెట్టి, పని ఇస్తాను చేస్తావా అన్నాడు. రామారావు సందేహించాడు.

అతని మేలుకోరిన ఒక పెద్ద మనిషి, సినిమా అనుభవాలతో తలపండిన వాడు ఒప్పుకోవద్దని సలహా ఇచ్చాడు.

'అబ్బాయి! నువ్వూ పైకిరావలసిన వాడివి. నీ ఫ్రెండు రాజారావు అలాటివాడే. అందువల్ల మీ యిద్దరూ జాయింట్‌గా పైకిరాలేరు. ఎవడో ఒకడు ఇంకోడి నెత్తిన కాలుపెట్టి పైకెక్కాలి. అతనికి పని ఏమీ తెలీక

పోయినా, అంతా తనేచేస్తానని బేరం ఒప్పుకున్నాడు. కాబట్టి ప్రజ్ఞాశాలి. నీకు పనితెలిసినా, సందేహిస్తున్నావు. కాబట్టి నువ్వు లోకవ్యవహారంలో పరమ వాజమ్మవి. అంచేత మీ కాంబినేషన్ నీకు మంచిదికాదు". అని నూరిపోశాడు.

కాని రాజారావు బలవంతం చేసినందువల్ల రామారావు,ఆసలహాలు పట్టించుకోకుండా, పనిచేయడానికి ఒప్పేసుకున్నాడు.

ఇంక చెప్పేదేముంది. రాజారావు నానా హడావుడీచేసి పెద్దరికం చెలాయించేవాడు.

ఇతన్ని గది కదలొద్దని శాసించి, సినిమాకి డైలాగులూ, పాటలూ అన్నీ రాయించేసుకున్నాడు. ఇదికాక, ఇంకా అడ్డమైనచాకిరీ చేయించుకుని ప్రొడక్షన్ ఖర్చులన్నీ జేబులో వేసుకునేవాడు. డబ్బింగులో, మూడు కారెక్టర్లకి రామారావుచేత డైలాగులు చెప్పించాడు. ఎడిటింగ్ పనికి తన తరఫు మనిషిగా కూర్చోబెట్టి రాత్రిళ్ళుకూడా పనిచేయించాడు. ఎంత లోకువగా వాడుకున్నాడంటే, ఆఖరికి డబ్బింగులో, తను కోపధారి డైలాగులు బాగా చెప్పడానికితగ్గ వేడిమూడ్ రావడానికని రామారావుని నిలబెట్టి ఉత్తపుణ్యానికి తిట్టిపోసేవాడు. ఇంకా ఏం చెప్పను బ్రదర్. తల్చుకుంటే గ్లిసరిన్ లేకుండా కళ్ళ నీళ్ళొస్తాయి. చివరికి ఏమైందను కున్నావు ?

పిక్చరు టైటిల్సులో డైలాగులు రాసినవాడు టి. ఆర్. రావు అని వేయించాడు. "అదేమిటి, టి. రామారావు అని వెయ్యరాదా, ఇంకెక్కడి కన్నా వెళ్తే యిదిచూసి అయినా ఛాన్సిస్తారూ" అని అడిగాడు రామారావు.

"ఫరవాలేదు బ్రదర్ అలాగే ఉంచు. నాపేరు టి. రాజారావు. అంటే ఇద్దరికీ పనికొస్తుంది. నీదని నువ్వను నాదని నేనంటా" అన్నాడు రాజారావు.

'సరే డబ్బున్నా పారెయ్యి రూముకి అద్దె కట్టాలి' అన్నాడు రామారావు.

'ఎంత'

'పదిహేను'

"వెరీగుడ్. పాతిక తీసుకో. బోయినానిక్కూడా ఉంటుంది. గుడ్‌లక్" అనేసి లేచిపోయాడు రాజారావు.

*   *   *   *

'19 వేల అడుగుల ఫిలిముకి డైలాగులూ, పాటలూ రాసి, మూడు పెద్ద కారెక్టర్ల డబ్బింగుకి డైలాగులు చెప్పి, మూణ్ణెల్ల అహో రాత్రాలూ అడ్డమైన చాకిరీ చేసినందుకు ఇదా ఫలితం' అని పెద్దడైలాగు రాసి చదువుకుని మరీ ఏడిచాడు రామారావు.

ఆపైన, అతను పనివెతుక్కుంటూ అక్కడా అక్కడా, ఫలానా పిక్చరుకి డైలాగులు రాసిన టి. ఆర్రావుని అని చెప్పుకునేవాడు.

కాని ఎవరూ నమ్మలేదు. రాజారావు పేరుకొట్టేస్తున్నాడనుకున్నారు. ఓ రోజున రాజారావే తనకి తెలిసిన నలుగుర్లోనూ పెట్టి కడిగేశాడు ఇతన్ని. తప్పు కాదూ ఇలాటి దొంగపనులు చేస్తావా అని.

చూశావా ఆనాడు, అతనికి సలహా ఇచ్చిన అనుభవజ్ఞుడి మాటవింటే, ఇంత అవస్థ వచ్చేదా ? ఇపుడు భవిష్యత్తుకూడా లేకుండా పోయింది?. అని కథ ముగించాడు కొలంబస్.

రాజు బరువుగా నిట్టూర్చాడు.

"అన్నట్టు ఇంకో తమాషా విను. ఇది జరిగిన ఆర్నెల్లకి ఒక సింహళభాష పిక్చరు డబ్బింగు అవుతోందని వార్తవచ్చింది. మాటలూ పాటలు రాస్తున్న వాడిపేరు టి.ఆర్. రావు అని తెలిసింది. రాజారావు అని

రామారావు అనుకున్నాడు. రామారావు పైకొస్తున్నాడేమోనని రాజారావు హడలిపోయాడు. ఇంతకీ ఈ మిష్టరీ ఏమిటంటావు ఆ టి. ఆర్. రావు ఎవరంటావు ?

రాజు ఓ నిముషం ఆలోచించి బహుశా రాజారావేనేమో అన్నాడు.

'నీ బొంద. కాదని చెప్పానుగా ఈ టి. ఆర్. రావు పేరు రంగారావు !.... .... యూస్‌లెస్ బ్రదర్. నువ్వు పనికిరావు. ఈమాత్రం కనిబెట్టకపోతే ఏంలాభం ? అన్నాడు కొలంబస్.

కొలంబసూ, రాజూ హోటల్లోంచి ఇవతలకు వచ్చి నాలుగు అడుగులు వేసేవరకు, వారిని వరుసుకుంటూ వచ్చి ఓ పెద్ద పాతకారు ఆగింది.

'బ్బబబ .... బ్బావ' అన్నాడు కొకొక్కొలంబస్.

'య్యెయ్యెయ్యె య్యెక్కు' అన్నాడు కకక్కారులోని బబబ్బావ.

కొలంబస్ మారుమాట లేకుండా కారులోకి పోయిపడ్డాడు. తారుదారి మీద కారు జారిపోయింది.

రాజుకి ఒక నిముషందాకా ఏమీ తెలియలేదు. ఒక ఫిలిములో కారెక్టరు ఇంకో ఫిలిం సెట్‌లోకి వస్తే, దాని తాలూకు డైరెక్టరు చివాట్లేసి మళ్ళీ అసలుకథలోకి లాక్కుపోయినంత మామూలుగా, కొలంబస్ వెళ్ళిపోయాడు. ఇలాటి ప్రమాదాలు మామూలేననడానికి ఏ సినిమా చూసినా నిదర్శనం కనిపిస్తుందిగదా.